విశాలాంధ్ర

కృష్ణా, ఎన్టీఆర్ గుంటూరు, పల్నాడు

గురువారం 19 డిసెంబరు 2024 8 పేజీలు

భూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులు

మంత్రి కొల్లు రవీంద్ర

విశాలాంధ్ర బ్యూరో మచిలీపట్నం : మచిలీపట్నం మండలం పోతేపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలోని భూసమస్యల పరిష్కారం కోసం గ్రామ సచివాలయం వద్ద బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో రాష్ట్ర గనులు, భూగర్భవనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దీర్ఘకాలంగా ఉన్న భూ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సుల కార్యక్రమం చేపట్టి ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. ప్రభుత్వం అన్ని నియోజకవర్గాలలోని ప్రతి గ్రామంలోనూ భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం అందించే విధంగా మీ భూమి, మీహక్కు పేరుతో రెవెన్యూ సదస్సులు

-మిగతా 2 లో ...

త్వరలో ఎలక్ట్రికల్ బస్సులు : కొనకళ్ల

విశాలాంధ్ర బ్యూరో మచిలీపట్నం : రానున్న రోజుల్లో ప్రయాణికులకు సుఖవంతంగా, సౌకర్యవంతంగా ఉండేందుకు హైర్ చేసుకున్న బస్సుల స్థానంలో ఎలక్ట్రికల్ బస్సులు తీసుకురావాలన్నదే సీఎం నారా చంద్రబాబు నాయుడు కోరికని, దీనికి కేంద్ర ప్రభుత్వ సహకారం ఉందని, త్వరలో ఎలక్ట్రికల్ బస్సులు తెస్తామని చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు అన్నారు. ఏపిఎస్ ఆర్టీసీలో సుమారు 11 వేల బస్సులు ఉన్నాయని వాటిలో 10 వేల బస్సులు సంస్థకు సంబంధించినవని, మిగిలినవి హైర్ చేసుకున్న బస్సులని తెలిపారు. ఎలక్ట్రికల్ బస్సుల వలన ప్రయాణికులకు సౌకర్యంతో పాటు సంస్థకు మైలేజ్ మరియు మైంటెనెన్స్ భారం తగ్గుతుందని, పర్యావరణ కాలుష్య నివారణ సాధ్యమవుతుందని సంస్థ లాభాల్లోకి

-మిగతా 2 లో ...

21, 22 తేదీల్లో 'వివా వీవీఐటీ' 2కే24-25

విశాలాంధ్ర-పెదకాకాని : వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో ఈ నెల 21, 22 తేదీలలో జాతీయ స్థాయి యువజనోత్సవం 'వివా వీవీఐటీ 2కే24-25' నిర్వహించనున్నట్లు వీవీ ఐటీ కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలి పారు. వసుధైక కుటుంబాన్ని ప్రతిబింబించేలా భూమిపై అన్ని జీవరాసులు ఒకే కుటుంబం అనే ఆలోచన చాటేలా 'ది వరల్డ్ ఈజ్ వన్' నేపథ్యంలో ఈ యువజనోత్సవాన్ని నిర్వహించనున్నారు. స్టూడెంట్ యాక్టివిటీ కౌన్సిల్(శాక్) విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించే ఈ వేడుకలో విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకత, నైపుణ్యం, కళాత్మకతను

-మిగతా 2 లో ...

నేడు అమిత్‌షా వ్యాఖ్యలను ఖండిస్తూ సీపీఐ నిరసన

విశాలాంధ్ర-విజయవాడ: డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను కించపరుస్తూ కేంద్ర హెూం మంత్రి అమిత్ షా వ్యాఖ్యలు చేయటాన్ని ఖండిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుట్టి రాయప్ప బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద గురువారం ఉదయం 11 గంటలకు ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. అమిత్ షా దేశ ప్రజలకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని, కేంద్ర మంత్రి వర్గం నుంచి అమిత్ షాను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ జరిగే ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు. సీపీఐ శ్రేణులు పెద్ద ఎత్తున సకాలంలో హాజరు కావాలని కోరారు.

రేపు గంగూరులో సీఎం పర్యటన

ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

విశాలాంధ్ర-పెనమలూరు : సీఎం నారా చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటన దృష్ట్యా పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. ఈ నెల 20న శుక్రవారం కృష్ణాజిల్లా పెనమలూరు మండలం గంగూరు గ్రామంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన సందర్భంగా జిల్లా కలెక్టర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ పర్యటనలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించటంలో భాగంగా రైతు సేవా కేంద్రం, సమీపంలోని వెంకటాద్రి ఆయిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ రైస్ మిల్, అనంతరం గంగూరు గ్రామంలో రెవెన్యూ సదస్సులో ముఖ్యమంత్రి పాల్గొంటారన్నారు. కార్యక్రమానికి సంబంధించి ఏర్పాట్లను శాసనసభ్యులు బోడే ప్రసాద్ తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, స్థానిక శాసనసభ్యులు బోడే ప్రసాద్, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మతో కలిసి రెవెన్యూ, పౌరసరఫరాలు, వ్యవసాయం, పంచాయతీరాజ్ ఆర్అండ్ బి, బుధవారం రైతు సేవా కేంద్రంలో అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సేవా కేంద్రంలో

-మిగతా 2 లో ...

దీక్షాదారులకు త్వరితగతిన అమ్మ దర్శనం

- 6 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా
- దీక్షల విరమణకు ఏర్పాట్లు పూర్తి : కలెక్టర్, సీపీ

2

వలంటీర్ వ్యవస్థను కొనసాగించండి

సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు

విశాలాంధ్ర-విజయవాడ: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం వలంటీర్ వ్యవస్థను కొనసాగించి మాట నిలబెట్టుకోవాలని సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు అన్నారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్

-మిగతా 2 లో ...

హరిశ్చంద్రాపురం లిఫ్ట్ పనులు ప్రారంభించాలి

అఖిలపక్ష, రైతు, కార్మిక, ప్రజా సంఘాల డిమాండ్

విశాలాంధ్ర-నరసరావుపేట: కృష్ణా గోదావరి పెన్నా నదుల అనుసంధానం ప్రాజెక్టు హరిశ్చంద్రాపురం నుండి నకరికల్లు వద్ద ఎత్తిపోతల పథకం పనులు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రారంభించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, కన్వీనర్ ఉలవలపూడి రాము అన్నారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో బుధవారం అఖిలపక్ష రైతు, కార్మిక, ప్రజా సంఘాల సమావేశం జరిగింది. సమావేశంలో గొల్లపూడి రాము మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు పూర్తయితే పల్నాడు, గుంటూరు ప్రకాశం, బాపట్ల జిల్లాల రైతుల ప్రజల సాగు నీరు తాగు నీరు పూర్తిగా అందుటయే కాక ఆ ప్రాంతాలన్నీ సస్యశ్యామలంగా అభివృద్ధి చెందుతాయని అన్నారు. ఆ ప్రాంత ప్రజల కోరిక మేరకు ప్రాజెక్టును వెంటనే పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ కొన్ని తీర్మానాల్ని అఖిలపక్షం, రైతు సంఘం, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో తీర్మానించడం జరిగింది. ఈ సమావేశానికి రైతు సంఘాలు, కార్మిక సంఘాలు, అన్ని ప్రజా సంఘాల పెద్ద ఎత్తున

-మిగతా 2 లో ...

(మొదటి పేజీ తరువాయి)

త్వరలో ఎలక్ట్రికల్ బస్సులు : కొనకళ్ల

రావడానికి అస్కారం ఉందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆర్టీసీ ఉద్యోగులకు నైట్ హాల్ట్ చేసే వారికి అలవెన్స్ ఇస్తూ జీఓ కూడా ఇవ్వడం జరిగింది. ఇంతవరకు ఆర్టీసీలో చార్జీలు పెంచలేదు. ప్రయాణికులపై భారం పడకుండా బస్సులు మైంటెనెన్స్ చేయడం జరుగుతుందని తెలిపారు.

భూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులు

కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. గత ప్రభుత్వం లోని పాలకులు వారి కనుకూలంగా భూ సరిహద్దు లను మార్చేసి అవకతవకలకు పాల్పడ్డారని, వాటిని సరిచేసే క్రమంలో కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే రాష్ట్ర ముఖ్యమంత్రి పెట్టిన రెండవ సంతకంతో భూహక్కు చట్టాన్ని రద్దు చేశారన్నారు. నియోజకవర్గం లోని ప్రతి రెవెన్యూ గ్రామ పరిధిలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను శాశ్వతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సూచించారు. పోతేపల్లి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద సిమెంట్ రోడ్డు నిర్మించడంతో పాటు గుంతలతో పాడైపోయిన రోడ్లన్నీటి మరమ్మత్తులు చేపడుతున్నామ న్నారు. గత ప్రభుత్వ హయాంలో సెంటు భూమి ఇచ్చి ఇల్లు నిర్మించుకునేందుకు రూ. 1.80 లక్షలు మాత్రమే ఇచ్చేవారని, ఏవిధంగా సరిపోక ఇబ్బందులు పడుతున్న ప్రజల కష్టాలను తీర్చేందుకు కూటమి ప్రభుత్వం లబ్దిదారులకు రూ. 2.50 లక్షలను మంజూరు చేయడంతో పాటు అవసరమైన వారికి బ్యాంకు ద్వారా రుణాలను మంజూరు చేయడంజరుగుతుందన్నారు. పోతేపల్లిలో జువెలరీ పార్కు ఏర్పాటుతో అభివృద్ధి అంచెలంచెలుగా పెరుగుతొందని, మచిలీపట్నం పోర్టు నిర్మాణంతో పాటు అనుబంధ పరిశ్రమల రాకతో ఉపాధి అవకాశాలు కల్పనతో మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ ప్రాంతంలో తాగునీరు, డ్రైనేజ్ సమస్య ఉందని, త్వరలో అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామన్నారు. పోతేపల్లి నుంచి పెదపట్నం వరకు నీటి సమస్యను అధిగమించేందుకు నేరుగా కృష్ణానది నుండి పైప్‌లైన్ నిర్మాణం లేదా ఆ ప్రాంతంలో ఒక పెద్ద చెరువును నిర్మించి నిరంతర నీటి సరఫరా కు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు మంత్రి తెలిపారు.

21, 22 తేదీలలో 'వివా వీవీఐటీ' 2కే24-25

వెలికితీసే విధంగా సాంకేతిక, క్రీడా, సాంస్కృతిక విభాగాలలో 93 అంశాలలో పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ యువజనోత్సవానికి సంబంధించిన ప్రచారప్రతులను విద్యార్థులతో కలసి కేంద్ర గ్రామీణాభివృద్ధి, సమాచార ప్రసారాల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కళాశాల సందర్శనలో విడుదల చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, డీన్ ఆఫ్ ఎకడమిక్స్ డాక్టర్ కె.గిరిబాబు పాల్గొన్నారు. వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ డిసెంబరు 21, 22 తేదీలలో యువజనోత్సవం, 23వ తేదిన కళాశాల వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. భారతీయ సంస్కృతి చాలా గొప్పదనీ, జాతీయత, కుల, మత, వర్ణ ఆధారిత భేదాలకు భారత సంస్కృతి ఆస్కారం ఇవ్వదని చాటే విధంగా 'ది వరల్డ్ ఈజ్ వన్(ప్రపంచం అంతా ఒక్కటే)' నేపథ్యాన్ని ఈ యువజనోత్సవానికి ఎంపిక చేసినట్లు తెలిపారు. వీవీ వీవీఐటీ కన్వీనర్ డాక్టర్ కె.గిరిబాబు మాట్లాడుతూ యువజనోత్సవంలో పాల్గొను విద్యార్థులు వీవావీవీఐటీ.కామ్ వెబ్‌సైట్‌లో వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. యువజనోత్సవంలో పాల్గొనే విద్యార్థులకు గుంటూరు, విజయవాడ, తెనాలి ప్రాంతాల నుంచి రవాణా సౌకర్యాలు ఏర్పాటు చేసామని తెలిపారు. శాక్ విద్యార్థి సోమదినేష్ మాట్లాడుతూ వీవీఐటీ కళాశాల నిర్వహించు యువజనోత్సవం 'వివా వీవీఐటీ'కు ప్రత్యేక గుర్తింపు ఉన్నదని, రెండు రోజుల పాటు నిర్వహించు ఈ వేడుకలు కళాశాలలోని ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విద్యార్థుల సహకారంతో నిర్వహించనున్నట్లు తెలిపారు.

రేపు గంగూరులో సీఎం పర్యటన

రైతులకు అందుతున్న సదుపాయాలను, ధాన్యం కొనుగోలు ప్రక్రియపై రైతులతో ముఖాముఖి నిర్వహించి వారి అభిప్రాయాలను తెలుసుకుంటారన్నారు. అనంతరం స్థానికంగా ఉన్న వెంకటాద్రి రైస్ మిల్లులో ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్న తీరును పరిశీలిస్తారన్నారు. అనంతరం గంగూరు గ్రామంలో రెవెన్యూ సదస్సులో పాల్గొంటారని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పాల్గొనే కార్యక్రమాలకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేసి పర్యటనను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారుల ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటించే మార్గం లో రహదారులు గుంతలు లేకుండా సవ్యంగా ఉండేలా సరిచేయాలని, హెలిపాడ్ ఏర్పాట్లు చూడాలని పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. ఏర్పాట్ల పరిశీలన, అనంతర సమావేశంలో జిల్లా ఎస్పీ గంగాధర్, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, రెవెన్యూ డివిజనల్ అధికారి షారోన్, డీఎస్‌ఓ పార్వతి, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ పద్మావతి, , పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ ,తహసిల్దార్లు పాల్గొన్నారు.

హరిశ్చంద్రాపురం లిఫ్ట్ పనులు ప్రారంభించాలి

పాల్గొన్నారు. ప్రాజెక్టు కింద నష్టపోతున్న రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి. సంబంధిత శాఖ అధికారులకు, ఎంపీ, ఎమ్మెల్యేలకి, మంత్రులకు వినతి పత్రాలు అందించడం. ఈ పథకం ద్వారా లబ్ది పొందుతున్న నాలుగు జిల్లాల రైతులందరిని కలుపుకొని సదస్సులు నిర్వహించడం తదితర తీర్మానాలతో సమావేశం తీర్మానించింది. ఈ కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్షులు టి బాబురావు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాసా రాంబాబు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఈ గోపాలరావు, కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షులు కామినేని రామారావు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు సిహెచ్ సత్యనారాయణ రాజు, ఉప్పలపాటి రంగయ్య, అంజిరెడ్డి, నాగేశ్వరావు, ఎస్కె చిన్న జాను సైదా , ఎస్ కోటేశ్వరావు, తోట నరసింహారావు, మోహన్ రెడ్డి, సిఐటీయూ జిల్లా నాయకులు ఎస్కె సెలారు, శాంసంగ్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ వ్యవస్థను కొనసాగించండి

రాష్ట్ర వలంటీర్ అసోసియేషన్ (ఏఐవైఎఫ్ అనుబంధం) ఆధ్వర్యంలో వలంటీర్లు చేపట్టిన 50 గంటల ఆత్మగౌరవ దీక్ష శిబిరాన్ని మూడవ రోజు బుధవారం ఆయన సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేయటానికి వలంటీర్ల సేవలు అవసరం అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రజలకి ప్రభుత్వానికి మధ్య వారధిలా ప్రభుత్వం చెప్పిన ప్రతి పనిని చేసిన వలంటీర్లను ఒక పార్టీకి ఆపాదించడం సరికాదన్నారు. వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని రూ.10 వేలు గౌరవ వేతనం ఇవ్వాలని, బకాయి పడ్డ జీతాన్ని తక్షణమే చెల్లించాలని వలంటీర్లు చేస్తున్న పోరాటానికి సీపీఐ పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు అందిస్తుందని రాష్ట్ర ప్రభుత్వం వలంటీర్లకు న్యాయం చేయకుంటే పెద్ద ఎత్తున రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు.

దీక్షాదారులకు త్వరితగతిన అమ్మ దర్శనం

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : అమ్మవారికి ఇరుముడి సమర్పించేందుకు తరలివచ్చే లక్షలాది భవానీ దీక్షాదారులు, యాత్రికులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఆధ్యాత్మిక వాతావరణంలో భవానీ దీక్షలు విరమణ అనంతరం అమ్మవారి దర్శనం కల్పించేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నాట్లు జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మిశ తెలిపారు. భవాని దీక్షల విరమణ కార్యక్రమం సందర్భంగా భక్తులకు ఏర్పాటు చేస్తున్న సౌకర్యాలను బుధవారం కలెక్టర్, సీపీ ఎస్‌వీ.రాజశేఖర్ బాబులు, దేవాదాయ, రెవెన్యూ, పోలీస్, వైద్య, ఆరోగ్య, అగ్నిమాపక, నగరపాలక సంస్థ, విద్యుత్, ఇరిగేషన్, ఆర్ అండ్ బీ, మత్స్యశాఖల అధికారులతో కలిసి పర్యవేక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈనెల 21 నుండి 25 వరకు భవానీ యాత్రికులు అమ్మవారికి ఇరుముడులు సమర్పించి దీక్షలు విరమిస్తారన్నారు. రోజుకు సుమారు లక్ష మంది చొప్పున 6 లక్షల మంది భవానీలు, యాత్రకులు అమ్మవారిని దర్శించుకుంటారని అంచనా వేస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. దసరా ఉత్సవాలు విజయవంతం చేసిన తరహాలో భవానీ దీక్షా విరమణల కార్యక్రమాన్ని కూడా విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. క్యూ మార్గంలో వాటర్ ప్రూఫ్ షామియానాలు, క్వాయర్ మ్యాట్లు, తాగునీరు సరఫరా వంటి ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. పబ్లిక్ అడ్రసింగ్ విధానం ద్వారా భక్తులకు నిరంతరం సూచనలు, సమాచారం అందించడం జరుగుతుందన్నారు. అవసరమైనన్ని తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేసి నిరంతరం పారిశుధ్య పనులు చేపట్టేలా మున్సిపల్ అధికారులు పర్యవేక్షిస్తారన్నారు. ఆలయం చుట్టుపక్కల మాత్రమే కాకుండా నగరానికి వచ్చే వివిధ రహదారుల వెంబడి వైద్య శిబిరాలతో పాటు విశ్రాంతి ప్రాంగణాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. స్నానా ఘట్ల వద్ద భక్తులకు అవసరమైన ఏర్పాట్లతో పాటు భక్తులకు త్వరగా అమ్మవారి దర్శనం, ఇరుముడులు సమర్పించేందుకు ఏర్పాట్లు, భక్తుల సౌకర్యార్థం మూడు హోమ గుండాల ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులకు అవసరమైన లడ్డూ ప్రసాదాలను సిద్ధంగా ఉంచాలని దేవాదాయ అధికారులను ఆదేశించామన్నారు. ఘాట్ల వద్ద స్నానం ఆచరించి మాల విరమణ అనంతరం వస్త్రాలు నీటిలో వదిలే ప్రాంతంలో పారిశుద్యం నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

సీపీ మాట్లాడుతూ భవానీ దీక్షా విరమణ భక్తులకు ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. క్యూ లైన్లు ఏర్పాట్లు వెయిటింగ్ హాళ్ళు, పార్కింగ్ స్థలాలు, లడ్డూ ప్రసాదం, అన్నప్రసాదాల పంపిణీ వివరాల యాప్ ద్వారా యాత్రికులు తెలుసుకోవచ్చున్నారు. కట్టుదిట్టమైన భద్రత చర్యలతో పాటు అన్ని ముఖ్య ప్రాంతాల్లో సీసీటీవీలను ఏర్పాటు, విభిన్న ప్రతిభావంతుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. నగరపాలక సంస్థ కమీషనర్ ధ్యానచంద్ర మట్లాడుతూ పారిశుధ్యానికి ప్రత్యేక టీమ్‌లను సిద్ధం చేసి, ఎప్పటికప్పుడు చర్యలు తీసుకునేలా ప్రణాళికను రూపొందించి అమలు చేస్తున్నాట్లు తెలిపారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సంస్థ, స్వచ్ఛంద సంస్థలు, వాలంటీర్ల సేవలను వినియోగించుకుని కార్యక్రమ విజయవంతానికి కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆలయ ఈవో కేఎస్ రామారావు మట్లాడుతూ దసరా ఉత్సవాల తరహాలోనే భవానీ దీక్షా విరమణలను విజయవంతం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. సీతమ్మవారి పాదాలు, పున్నమి ఘాట్, భవానీ ఘాట్ వద్ద మొత్తం 800 వరకు షవర్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. గత అనభవాలను దృష్టిలో ఉంచుకొని లడ్డూ ప్రసాదానికి కొరత లేకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో విజయవాడ ఆర్డీవో చైతన్య, ఆలయ ఈఈలు కోటేశ్వరరావు, రెవెన్యూ, పోలీస్, వైద్య, ఆరోగ్య, అగ్నిమాపక, నగరపాలక సంస్థ, విద్యుత్, ఇరిగేషన్, ఆర్ అండ్ బీ, మత్స్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

తబలా మాస్ట్రో జాకీర్ హుస్సేన్‌కు నివాళులు



విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్ : ప్రసిద్ధ తబలా విద్వాంసుడు పండిట్ అల్లారఖా పెద్ద కుమారుడు తబలా మాస్ట్రో పద్మవిభూషణ్ జాకీర్ హుస్సేన్ మృతికి పలువురు సంతాపాన్ని వెలిబుచ్చారు. కౌతాపూర్ణానందం కళా సంస్థల కార్యాలయంలో జాకీర్ హుస్సేన్ చిత్రపటానికి పూలు దండలు వేసి నివాళులర్పించారు. చింతకాయల చిట్టిబాబు, తబలా నాని, ఇజ్రాయెల్, తబలా వాసు, వై రాజు, డోలక్ ఏడుకొండలు, డేవిడ్ రాజు, జోషి, కంచర్ల కృష్ణ, సిహెచ్ జయరాజు, కె రవిబాబు తదితర ప్రముఖులు మాట్లాడుతూ తబలా విద్వాంసునిగా తబలా వాద్య ఉత్కృష్టతను అంతర్జాతీయ స్థాయిలో చాటుతూ భారతదేశ కీర్తిని ఇనుమడింప చేసిన ఘనత జాకీర్ హుస్సేన్ కు దక్కుతుందని అన్నారు.

"అప్పికట్ల"కు సహ ఉపాధ్యాయుల అభినందనలు.

విశాలాంధ్ర-కూచిపూడి : రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలైనట్రిపుల్ జంపులో విన్నర్ గా నిలిచి వచ్చే సంవత్సరం ఫిబ్రవరి 6 నుంచి 8 వరకు రాజస్థాన్లోని అల్వార్లో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన ఫిజికల్ డైరెక్టర్ ప్రధానోపాధ్యాయులు సూర్యదేవర శ్రీదేవి బుధవారం అభినందించి శాలువా పూలదండలతో సత్కరించారు. కృష్ణాజిల్లా మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుడివాడ ఎన్టీఆర్ స్టేడియంలో 44వ రాష్ట్రస్థాయి మాస్టర్ దీక్ష పోటీలలో పాల్గొన్న మొవ్వ శ్రీ మండవకనకయ్య జెడ్పీ హైస్కూల్ ఫిజికల్ డైరెక్టర్ రామారావు ట్రిపుల్ జంప్ లోప్రథమ స్థానం, ఎనిమిది వందల మీటర్ల పరుగులు తృతీయ స్థానం సాధించారు. ఫస్ట్ అసిస్టెంట్ పసుపులేటి శివ కోటేశ్వరరావు, సిబ్బంది కార్యదర్శి జాకీర్ అహ్మద్, ఉప కార్యదర్శిమేకరాణి, పాఠశాల మరొక ఫిజికల్ డైరెక్టర్ మండలి మనోహర్ తో పాటు పలువురు అభినందించారు

ప్లాస్టిక్ వినియోగంపై స్పెషల్ డ్రైవ్



విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర నగరంలో పెరిగిపోతున్న సింగిల్ యూస్ ప్లాస్టిక్ దృశ్యంపై నగరంలోని పలు ప్రాంతాల్లో వీఎంసీ అధికారులు బుధవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా నగరంలో వివిధ ప్రాంతాలలో శానిటరీ ఇన్స్పెక్టర్లు, ఇతర అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి యూస్ ప్లాస్టిక్ బ్యాన్ అమల్లో ప్లాస్టిక్‌ను విక్రయిస్తున్న వివిధ షాపులు, వ్యాపార సంస్థలను తనిఖీ చేసి వారికి జరిమానా విధించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో సింగిల్ యూస్ ప్లాస్టిక్‌ని వినియోగించవద్దని, పర్యావరణాన్ని పరిరక్షించేందుకు పర్యావరణహిత వస్తువులనే వాడాలని, ముఖ్యంగా వ్యాపారస్తులు సింగిల్ యూస్ ప్లాస్టిక్ వాడినచో వారిపై కఠినమైన చర్యలు తీసుకోవటంతో పాటు భారీగా జరిమానా విధిస్తారని హెచ్చరించారు.

రాణా ప్రతాప్‌కు చిలకలపూడి నివాళి



విశాలాంధ్ర-అవనిగడ్డ : అవనిగడ్డ రెండవ వార్డుకు చెందిన సైకం రాణా ప్రతాప్ ఇటీవల గుండెపోటుతో అకాల మరణం చెందారు బుధవారం పెద్దకర్మ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు పాల్గొని రాణా ప్రతాప్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

చిన్నారి అదృశ్యంపై కొనసాగుతున్న గాలింపు చర్యలు

విశాలాంధ్ర-అవనిగడ్డ : లంకమ్మమాన్యం కాలనీకి చెందిన ఆవుల గోపి కొండాలమ్మల కుమార్తె దివ్య కనిపించకుండా పోయి నాలుగు రోజులైంది. నాలుగు రోజులుగా పోలీసులు, ఫైర్ సిబ్బంది పంటకాలువ బాట పట్టి ముమ్మరంగా గాలించారు. అయినప్పటికీ ఏమాత్రం ఉపయోగం లేకుండాపోయింది. ఇప్పటికైనా సీసీ కెమెరాలు అన్ని సక్రమంగా పని చేస్తాయో లేదో రానున్న కాలంలో వేచి చూద్దాం.

రైలే క్రింద పడి గుర్తు తెలియని వృద్దురాలి మృతి

విశాలాంధ్ర-గుడివాడ : గుడివాడ ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని రామవరపాడు-నిడమానూరు రైల్వే స్టేషన్ల మధ్యలోని విజయవాడ రూరల్ మండలం కార్మికనగర్ – ప్రసాదంపాడు పంచాయతీ పరిధిలో గుర్తు తెలియని రైల్ ఢీకొని వృదురాలు మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు 65 సంవత్సరాలు వయసు కలిగిన ఉంటయన్నారు. మృతురాలి ఆచూకీ తెలిసిన వారు గుడివాడ రైల్వే ఎస్సై సెల్ నెంబర్ 9440627570కు సమాచారం అందించాలన్నారు.

గౌరవ వేతనం ఇప్పించండి : ఎంపీటీసీలు

విశాలాంధ్ర-పమిడిముక్కల: 16 నెలలుగా గౌరవ వేతనం రావటంలేదని, తమకు ఇచ్చేదే తక్కువని అది కూడా జాప్యం చేస్తున్నారని ఎంపిటిసి లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో అలస్యమైన వేతనాలు చెల్లించేవారని అదేమిటని అడిగితే నిధులు లేవని సమాధానం చెబుతున్నారని అసలు ఇస్తారో..ఇవ్వరోని.. ఆందోళన చెందుతున్నారు.కనీసం జనవరి లో నన్న తమ వేతనాలు చెల్లించాలని వారు కోరుతున్నారు.

భవాని దీక్షాపరులు పోలీస్ మొబైల్ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి : ఎస్ఐ గణేష్

విశాలాంధ్ర-బంటుమిల్లి :- భవాని దీక్షాపరులు వారి వారి మండల, ఇతర దీక్షలు పూర్తిచేసు కుని, దీక్షను విరమించడానికి విజయవాడ ఇంద్రకీలాద్రిపై ఉన్న కనకదుర్గ టెంపుల్ కు వెళ్లే భక్తులందరికీ కృష్ణా జిల్లా ఎస్పీ మొబైల్ యాప్‌ను రూపొందించారని భవాని దీక్షాపరులు పోలీస్ మొబైల్ యాప్ ను సద్వినియోగం చేసుకోవాలని బంటుమిల్లి ఎస్ ఐ గణేష్ కుమార్ మండల పరిదిలోని భవాని దీక్షాపరులకు బుధవారం వివరించారు. ఈ సందర్బంగా ఎస్ ఐ గణేష్ కుమార్ మాట్లడుతూ డిసెంబర్ నెల 21 నుండి 25వ తేదీ వరకు దీక్షను విరమించడానికి వెళ్లేవారు దర్శనం బుకింగ్, ప్రసాదం కొనుగోలు ప్రక్రియ ఈ యాప్ ద్వారా ఆన్లైన్లో చేసుకోవచ్చన్నారు. ఈ మొబైల్ యాప్ ద్వారా దర్శనం మరియు ప్రసాదం కోసం లైన్‌లో వేచి ఉండకుండా, సమయం వృధా కాకుండా, తొక్కిసలాట జరగకుండా ఉండేందుకు ముందుగానే బుకింగ్ చేసుకునే అవకాశం కల్పించారన్నారు. ప్రసాదం కోసం బుక్ చేసుకునే లడ్డు ప్రసాదం రూ.15 చొప్పున మికు ఎన్ని లడ్డు లు కావాలో అంత ఎమౌంట్ ఈ యాప్ ద్వారా దేవస్థానం వారికి చెల్లించి క్యూఆర్ కోడ్ ద్వారా లైన్లో వేచి ఉండకుండగానే ప్రసాదాన్ని పొందవచ్చన్నారు.

ట్రాఫిక్ పోలీసులకు కళ్ల జోళ్ల పంపిణీ

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): ట్రాఫిక్ పోలీసులకు డాక్టర్ అగర్వాల్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో బుధవారం పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు చేతుల మీదుగా పంపిణీ చేశారు. గవ్నర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆస్పత్రి ప్రాంగణంలో ఉచితంగా కళ్ళజోళ్లు అందచేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు మాట్లాడుతూ పోలీసుల ఆరోగ్యం కాపాడేందుకు డాక్టర్ అగార్వాల్స్ కంటి ఆస్పత్రి వంటి సంస్థలు ముందుకు రావడం చాలా సంతోషకమన్నారు. నగరానికి రక్షించే వారి శ్రేయస్సు నిర్వహించడంలో కంటి సంరక్షణ ప్రాముఖ్యత గుర్తు చేస్తుందని తెలియజేశారు. అగర్వాల్ ఆస్పత్రి వారిని ఆయన అభినందించారు. అగర్వాల్ ఆస్పత్రి మెడికల్ డైరెక్టర్ డాక్టర్ కెకేఎస్ చక్రవర్తి మాట్లడుతూ సమాజానికి సేవ చేసే వారి దృష్టి ప్రధానమని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ డీసీపీ కృష్ణమూర్తి నాయుడు, ఏడీసీపీ ఏవీఎల్ ప్రసన్న కుమార్, ఏసీపీలు, ప్రెసిడెంట్ గణేష్ సుబ్రమణ్యం, సీఐలు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం : ఏసీపీ తిలక్

విశాలాంధ్ర-కంచికచర్ల : సైబర్ నేరాలు, డిజిటల్ అరెస్టుపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నందిగామ ఏసిపి తిలక్ తెలిపారు. సంవత్సరాంతపు పరిశీలనలో భాగంగా బుధవారం కంచికచర్ల పోలీస్‌స్టేషన్‌ను ఏసిపి తిలక్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఏసిపి మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ముఖ్యంగా ఈజీ మనీ పేరు తో కనిపించే యాప్ లు,లోన్ యాప్ లు పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. గుర్తుతెలియని వ్యక్తుల యాప్ల ద్వారా సంప్రదించి వారి వారి అకౌంట్లో నుండి నగదు తస్కరించే అవకాశం ఉందని అటువంటి సమయంలో 1930 నెంబర్‌కు ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు. ప్రభుత్వం రూపొందించిన పి జి ఆర్ సి యాప్ ద్వారా పిటిషన్లను నిర్ణయిత సమయం లో పరిష్కరించే అవకాశం ఉందని, యాప్‌లో అప్‌లోడ్ చేసిన తరువాత తగిన సమయంలో పరిష్కారం కానట్లైతే లీగల్ మార్గాలను అన్వేషించి పిటిషనర్ల కు న్యాయం చేసేలా మార్గనిర్దేశకాలు ఉన్నాయని తెలిపారు. నేర నియంత్రణ లో భాగంగా అన్ని చర్యలు తీసుకుంటు న్నామని కంచికచర్ల పోలీస్ సిబ్బంది పనితీరు బాగుందన్నారు.ప్రభుత్వం ఏర్పాటు చేసిన 1972 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా గంజాయికి సంబంధించిన సమాచారం తెలపవచ్చని,అలా ఫిర్యాదు వచ్చిన వెంటనే ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈగల్ టీం రంగం లోకి దిగుతుందని గంజాయి నియంత్రణపై ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందడుగు వేస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో రూరల్ సిఐ డి.చవాన్,కంచికచర్ల ఎస్సై బోనగిరి రాజు,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కమిషనరేట్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): ప్రేమ, త్యాగనిరతికి చిహ్నం క్రిస్మస్ పండుగ అని, కుల మత భేదంలేకుండా అందరూ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని విజయవాడ పోలీస్ కమిషనర్ ఎస్వీ.రాజశేఖరబాబు అన్నారు. బుధవారం పోలీస్ కమిషనరేట్‌లో పోలీస్ పరిపాలనా విభాగంలో ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఎన్.టి.ఆర్.జిల్లా పోలీస్ పరిపాలనా విభాగం వారు ఏర్పాటు చేసిన సెమి క్రిస్మస్ సెలబ్రేషన్స్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నగర పోలీస్ కమీషనర్ శ్రీ ఎస్.వి.రాజ శేఖర బాబు ఐ.పి.ఎస్.గారు. క్రిస్మస్ వేడుకల సందర్భంగా ఈ రోజు ది.18.12.2024 వ తేదీన ఎన్.టి.ఆర్.జిల్లా పోలీస్ పరిపాలనా విభాగం సిబ్బంది పోలీస్ కమీషనర్ వారి కార్యాలయంలో సెమి క్రిస్మస్ సెలబ్రేషన్ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లినగర పోలీస్ కమీషనర్ శ్రీ ఎస్.వి.రాజ శేఖర బాబు పాల్గొన్నారు. ఈ నేపధ్యంలో లినగర పోలీస్ కమీషనర్ శ్రీ ఎస్.వి.రాజ శేఖర బాబు ఐ.పి.ఎస్.గారు మాట్లాడుతులి.... పోలీసు మరియు పరిపాలనా విభాగ అధికారులు, సిబ్బందికి ముందుగా రాబోయే క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలియజేసారు, పండుగల ఆదర్శాలు, సిద్ధాంతాలను అందరూ పాటించాలని, ఏసుక్రీస్తు జన్మదిన వేడుకలు మీరందరితో కలిసి జరుపుకోవడం ఎంతో సంతోషంగా మరియు ఆనందదాయకంగా ఉందని తెలియజేశారు. అనంతరం సెమి క్రిస్మస్ కేకును కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి అభినందనలను తెలియజేసారు. ఈ కార్యక్రమంలో నగర పోలీస్ కమీషనర్ శ్రీ ఎస్.వి.రాజ శేఖర బాబు ఐ.పి.ఎస్. గారితోపాటు, ఇన్ చార్జ్ అడ్మిన్ డి.సి.పి. శ్రీ కృష్ణమూర్తి నాయుడు గారు, ఏ.ఓ. శ్రీమతి సునిత గారు, పోలీస్ అధికారుల సంఘం ప్రెసిడెంట్ శ్రీ సోమయ్య గారు, ఏ.సి.పి.లు మరియు పరిపాలనా విభాగ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: స్థానిక మండలపరిషత్తు కార్యాలయంలో గ్రామ సచివాలయ సిబ్బంది, సర్పంచులకు సాగుతున్న శిక్షణ బుధవారం ముగిసింది. గ్రామస్థాయి అభివృద్ధి ప్రణాళిక, సాధించేందుకు ఎంచుకున్న లక్ష్యాలపై ఈ శిక్షణా కార్యక్రమం జరిగినట్లు ఎంపీడీఓ సిహెచ్.చిన్నరాట్నాలు తెలిపారు.

ప్రకటన

నా క్లయింటు అయిన ఎన్.టి.ఆర్.జిల్లా, విజయవాడ, సత్యనారాయణపురం, కనకరాజు వీధి, డోరు నెం. 23 - 30 -16 కాపురస్తులు **నిడుముక్కల వెంకట శివప్రసాద్, తండ్రి: వెంకట సుబ్బారావు** యిచ్చిన ప్రకారం తెలియజేయునది ఏమనగా...

యీ దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తి అనగా విజయవాడ, సత్యనారాయపురం, కనకరాజువీధి, విజయవాడ విలేజ్ పోర్షన్ తాలూకు **రీసర్వే నెం. 129/5, డోరు నెం.23-30-16, 16ఎ, 16బి** దాఖలా స్థిరాస్తిని విజయవాడ కాపురస్తులు **పిట్ల (లేటు) శ్రీను గారి భార్య జయలక్ష్మి, పిట్ల సాయిస్వప్న, పిట్ల దుర్గాప్రసాద్, పిట్ల రాజేష్, పిట్ల పద్మజ** గారల వద్ద నుండి క్రయం పొందుటకు నిర్ణయించుకొని, కొంత సొమ్మును అడ్వాన్సుగా చెల్లించి మిగతా క్రయధనం చెల్లించుటకు సిద్ధముగా యున్నారు. నా క్లయింటు పేరున గాని, లేదా వారు కోరిన వారి పేరున గాని క్రయ దస్తావేజు వ్రాయించి రిజిష్టరు చేయించుకొను టకు యెగ్రిమెంట్లై యున్నారు. నెం. **2868/1942** దస్తావేజు దాఖలా చ.గ. 150-3లు స్థిరాస్తి, అందలి గ్రౌండు, ఫస్టు, సెకండ్ ఫ్లోర్లుగా గల ఆర్.సి.సి. బిల్డింగుతో సహా పిట్ల రంగనాయకమ్మ గారికి సంక్రమించి, దర్శిలా ఆమె కుమారులకు, మరియు మనుమడికి దఖలుపరచి, విజయవాడ జిల్లా రిజిస్ట్రారు వారి ఆఫీసులో దస్తావేజు నెం.566/2021, నెం. 567/2021, నెం.568/2021 ర్లుగా రిజిష్టరు చేయించి, మిగిలిన చ.గ.35.12లు స్థిరాస్తిని సర్వ హక్కులతో అనుభవిస్తూ, ది. **26-01-2024**వ తేదీన పరమపదించినారు. ఆమె కుమారుడైన పిట్ల శ్రీను గారు **ది.09-11-2024**వ తేదీన పరమపదించినారు. వారల మరణానంతరం పైతెలిపిన వారలకు సంక్రమించిన ఆస్థియై యున్నది. యిందుమూలముగా తెలియజేయునది ఏమనగా సదరు ఆస్తిపై గాని, సదరు విక్రయమునకు సంబంధించి గాని ఎవరికైనా అభ్యంతరములు గాని, క్లయిమ్స్ గాని, కోర్టు జప్తులు గాని, అవిభాజ్యపు హక్కులు గాని వున్న యెడల యీ ప్రకటన వెలువడిన ఏడు రోజులలోపు యీ క్రింది చిరునామాకు తగిన ఆధారాలతో రిజిష్టరు పోస్టు విత్ తిరిగి రశీదు ద్వారా తెలియజేయగలరు. గడువు తేది లోపు యెట్టి అభ్యంతరములు రాని యెడల షెడ్యూలు దాఖలా ఆస్థి నిర్వివాదమైన ఆస్థిగా యెంచి నా క్లయింటు క్రయ దస్తావేజు రిజిష్టరు చేయించుకోగల వాడని యావన్మందికి తెలియజేయడమైనది. గడువు తదుపరి వచ్చు అభ్యంతరములు నా క్లయింటుకు బైండ్ చేయజాలవు.

షెడ్యూలు : లోగడ కృష్ణా జిల్లా, ప్రస్తుతం ఎన్.టి.ఆర్. జిల్లా, విజయవాడ రిజిస్ట్రేషన్ జిల్లా, విజయవాడ జిల్లా రిజిస్ట్రారు వారి యిలాకా, విజయవాడ మున్సిపల్ కార్పోరేషన్ ఏరియాలో చేరిన, విజయవాడ, సత్యనారాయణపురం, కనకరాజు వీధిలోగల ఆస్థికి విజయవాడ విలేజ్ పోర్షన్ తాలూకు రీసర్వే నెం. 129/5, మున్సిపల్ వార్డు నెం. 15, ప్రస్తుత మున్సిపల్ వార్డు నెం. 47, ప్రస్తుత న్యూ అసెస్మెంటు నెం. 1073053003, నెం. 1073248930, మరియు నెం. 1073248931, డోరు నెం. 23- 30-16, 16ఎ మరియు 16 బి ర్లు దాఖలా స్థిరాస్తికి హద్దులు: **తూర్పు :** కనకరాజు వీధి అనే మున్సిపల్ రోడ్డు **అ. 36-0లు దక్షిణం :** కానూరు సుబ్బమ్మ గారు యితరులకు విక్రయిం చిన ఆస్తి.అ. **31-0లు, పడమర :** నిడుముక్కల వెంకట శివ ప్రసాద్, బుయ్యనప్రగడ పార్వతీదేవి గారల తాలూకు ఆస్తి. **అ.36-0లు, ఉత్తరం :** నిడుముక్కల వెంకట శివ ప్రసాద్, బుయ్యన ప్రగడ పార్వతీదేవి గారల తాలూకు ఆస్తి.**అ.31-0లు,** యీ నాలుగు హద్దుల మధ్య చ.గ. 124-0లు లేక చ.మీ. 103-68 ర్లు స్థిరాస్తి నివేశన స్థలము, సదరు స్థలములోని గ్రౌండు, ఫస్టు మరియు సెకండ్ ఫ్లోర్లుగా గల ఆర్.సి.సి. డాబా యింటితో సహాయున్నూ యిందలి యావత్తు వసరులతో సహాయున్నూ...

J.V. RAMANA, ADVOCATE
20-6-87, 3rd Line, Ramalingeswarapeta
VIJAYAWADA-520 003,
Cell: 9849241918

నగరంలో నకిలీ పోలీసులు?

- బంగారు వ్యాపారిని బెదిరించి రూ.30లక్షలు స్వాహా!
- పోలీసులకు ఫిర్యాదు చేసిన వ్యాపారి
- పోలీసుల అదుపులో 8 మంది నిందితులు?
- వారిలో కొందరు పాత నేరస్తులు?

విశాలాంధ్ర-విజయవాడ క్రైం: నగరంలో ఇద్దరు పాత నేరస్తులు నకిలీ పోలీసుల అవతారం ఎత్తారు. వారితో ఆరుగురు జతకట్టారు. అందరూ పోలీసులమని చెప్పి ఓ బంగారు వ్యాపారిని బెదిరించి రూ.30లక్షలు కాజేసినట్లు తెలిసింది. తాను మోసపో యానని తెలుసుకున్న బాధితుడు పోలీసులను ఆశ్రయించారు. వెంటనే విచారణ చేపట్టిన పోలీసులు గుట్టుగా విచారణ చేసి 8 మందిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు.... విజయవాడ నగరానికి చెందిన ఓ బంగారు వ్యాపారి ఈ నెల 11వ తేదీన బంగారం కొనుగోలు కోసం రైలులో చెన్నైకి బయలుదేరారు. అతడిని విజయవాడకు చెందిన ఎనిమిది మంది వెంబడించారు. గుంటూరు వద్దకు వెళ్లగానే తాము స్పెషల్ పోలీసులమని వ్యాపారిని బెదిరించారు. అంతడబ్బు ఎక్కడికి తీసుకెళ్తున్నావ్... దానికి లెక్కలు చూపించు.. అంటూ ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి చేశారు. దీంతో భయపడిన వ్యాపారిని గుంటూరులో రైలు దింపి కారులో విజయవాడ బీఆర్టీఎస్ రోడ్డు వద్దకు తీసుకొచ్చారు. అక్కడ కారులో ఉంచి సీఐతో మాట్లాడాలని కొద్దిసేపే వేచి ఉన్నారు. వ్యాపారి వద్ద ఉన్న రూ.30లక్షలు తీసుకుని మెల్లగా నకిలీ పోలీసులు జారుకున్నారు. వారు పక్కకు వెళ్లిపోయారని భావించిన వ్యాపారి కూడా అక్కడి నుంచి ఇంటికి వెళ్లారు. అయితే, ఆ తర్వాత తాను మోసపోయానని గుర్తించిన వ్యాపారి సత్యనారాయణపురం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. అనంతరం కేసు విచారణ చేపట్టిన సీసీఎస్ పోలీసులు ఎనిమిది మంది నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. వారిలో ఇద్దరు పాత నేరస్తులు, ఒక మహిళ ఉన్నట్లు సమాచారం. వీరి నుంచి రూ.30లక్షలు నగదు రికవరీ చేసినట్లు తెలిసింది. ఈ వ్యవహారంలో వ్యాపారి వద్ద పని చేస్తున్న ఒక వ్యక్తి కూడా కీలకంగా ఉన్నాడని, అతను ఇచ్చిన సమాచారం మేరకే ఈ మోసానికి పాల్పడినట్లు తెలుస్తోంది. ఈ నెల 15వ తేదీన నిందితులపై కేసు నమోదు చేసి, మరింత లోతుగా విచారణ చేస్తున్నారని సమాచారం.

పల్లె వెలుగు పాసింజర్ బస్ సర్వీస్‌లను రాత్రి 9.30 గంటల తర్వాత నడపాలి

విశాలాంధ్ర బ్యూరో మచిలీపట్నం : మచిలీపట్నం నుండి విజయవాడకు రాత్రి 9.30 గంటల తర్వాత పల్లె వెలుగు ప్యాసింజర్ బస్ సర్వీస్ లేని కారణంగా మచిలీపట్నం నుండి విజయవాడ మధ్యలోని పలు గ్రామాలకు వెళ్లాల్సిన చిరు వ్యాపారులు, రైతులు, గ్రామీణులు, మహిళలు, విద్యార్థులు, చిన్న చిన్న షాపుల్లో పనిచేసే కార్మికులు చాలా ఇబ్బంది పడుతున్నారు. దీనిని దృష్ట్యా మచిలీపట్నం డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందించారు.

ఎరువుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు

విశాలాంధ్ర-విస్సన్నపేట : విస్సన్నపేట మండలం కేంద్రంగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో విక్రయాలు జరుగుతున్న నకిలీ ఎరువుల సంఘటనపై అధికారులు దృష్టి సారించారు. ప్రధానంగా విస్సన్నపేటలోని ఎరువుల దుకాణాల్లో బుధవారం తనిఖీలు చేపట్టారు. పలు దుకాణాల్లో కొనుగోలు, విక్రయాలకు సంబంధించిన రికార్డులతోపాటు, కొన్ని నమూనాలను సేకరించి, పరీక్షలకు తరలించినట్లు తెలిపారు. వ్యవసాయశాఖ సహాయ సంచాలకురాలు కె.శశికళ, మండల వ్యవసాయాధికారి రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో ఈ తనిఖీలు జరిగాయి. అనంతరం మండలంలోని నరసాపురంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి పంటల బీమా పథకం వివరాలు తెలిపి, దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇదిలా ఉంటే, అసలు నకిలీ ఎరువుల తయారీ, విక్రయాలపై దర్యాప్తు సంతృప్తికరంగా సాగటంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. గత కొన్ని సంవత్సరాలుగా ఇక్కడి నుంచి నకిలీ ఎరువులు ఎగుమతి అవుతున్నాయని పలువురు రైతులు చెబుతుండగా, గత కొన్ని నెలలుగా ఈ కార్యకలాపాలు తమ దృష్టికి వచ్చాయని ప్రత్యక్షంగా ఫిర్యాదు చేసిన రైతులు వెల్లడిస్తున్నారు. ఇంతకాలం నుంచి ఇక్కడ ఈ తంతు సాగుతున్నా, రైతులు ప్రాణాలకు తెగించి, పట్టుకుని, ఫిర్యాదు చేసే వరకు వ్యవసాయ, పోలీసు, రెవిన్యూశాఖల అధికారులకు ఈ విషయం తెలియకపోవటం విడ్డూరంగా ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి. నకిలీ వ్యవహారంలో ఉన్నవారంతా తమకు తెలిసిన పాత నిందితులేనని రైతులు వాదిస్తుండగా, అధికారులు ఎవరిపైనా చర్యలు తీసుకున్న, కనీసం వారి పేర్లు వెల్లడించే ప్రయత్నం కూడా చేయకపోవటం విశేషం.

వేములమడలో రీసర్వే ప్రారంభం

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలంలోని వేములమడలో రీసర్వే ప్రాజెక్టులో నాలుగు బృందాలు పాల్గొని భూముల సర్వే ప్రారంభించారు. ఒక్కొక్క బృందంలో వీఆర్వో, ఇద్దరు సర్వేయర్లు, వీఆర్ఏ సర్వే నిర్వహిస్తున్నారు. 1,153.83 ఎకరాల విస్తీర్ణం ఉండగా పంట కాలువలు, చెరువులు లాంటి ప్రభుత్వ భూములు 73 సర్వే నెంబర్లలో 154.84 ఎకరాలు ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు. నాలుగు బృందాలు నిర్వహిస్తున్న భూముల సర్వే కార్యక్రమాన్ని రీ సర్వే డిప్యూటీ తాసిల్దార్ పి జగన్ మోహన రావు, మండల సర్వేయర్ ఏ కిషోర్ బాబుపర్యవేక్షిస్తుండగా సచివాలయ సర్వేయర్ జీ తేజశ్రీ సర్వే బృందాలకు సహకరిస్తున్నారు.

రాణా ప్రతాప్ కుటుంబ సభ్యులకు మండలి పరామర్శ

విశాలాంధ్ర-అవనిగడ్డ : అవనిగడ్డకు చెందిన ప్రముఖులు సైకం రాణా ప్రతాప్ కుటుంబాన్ని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, యువనాయకులు మండలి వెంకట్రామ్ పరామర్శించారు. రాణా ప్రతాప్ ఇటీవల మృతి చెందగా బుధవారం కుటుంబాన్ని పరామర్శించి, రాణా ప్రతాప్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు బండే రాఘవ నివాళులు అర్పించారు.

నాగమల్లేశ్వరమ్మ మృతికి కౌన్సిల్ నివాళి

విశాలాంధ్ర-పెడన : పెడన ఇటీవల అనారోగ్యంతో చనిపోయిన 14వ వార్డు కౌన్సిలర్ అనుమల నాగమల్లేశ్వరమ్మ మృతికి కౌన్సిల్ సంతాపం తెలిపింది. పట్టణంలోని 14 వ వార్డు టిడిపి కౌన్సిలర్ అకాల మరణాన్ని చింతిస్తూ ఆమె కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేస్తూ కౌన్సిల్ సమావేశంలో కౌన్సిల్ అత్యవసర సమావేశంలో సభ్యులు సంతాప తీర్మానాన్ని ఆమోదించి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కౌన్సిల్ సభ్యులు మాట్లాడుతూనాగమల్లేశ్వరమ్మ అకాల మరణం చాలా బాధాకరం అని అన్నారు. అదేవిధంగా గత నెలలో మరణించిన మాజీ మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు నసీర్ ఖాన్ కు నివాళులర్పించారు. దీంతో కౌన్సిల్ సమావేశాన్ని సంతాపదినంగా చైర్పర్సన్ ప్రకటించారు. ఈ సమావేశంలో కమిషనర్ మన్నెం.గోపాలరావు, మున్సిపల్ ఏఈ కాగిత సీతారామాంజనేయులు, పురపాలక సిబ్బంది కౌన్సిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థులు ఎంపిక

విశాలాంధ్ర-కూచిపూడి : ఈనెల 22వ తారీకు నుంచి 25వ తేదీ వరకు పశ్చిమ గోదావరి జిల్లా రావులపాలెం లో జరిగే 50వ రాష్ట్రస్థాయి జూనియర్స్ బాల బాలికల కబడ్డీ పోటీలకు కృష్ణాజిల్లాలోని మొవ్వ శ్రీ మండవ కనకయ్య జిల్లా పరిషత్ హై స్కూల్ నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు సూర్యదేవర శ్రీదేవి బుధవారం తెలిపారు. బాలుర విభాగంలో సాల్మన్ రాజు (10 వ తరగతి), బాలికల విభాగంలో మునిపల్లి ద్రాక్షాయణి(9వ తరగతి) ఎంపికైనారని పేర్కొన్నారు.

ఎన్టీఆర్ స్టేడియం బాడీ బిల్డర్‌కు కంచు పతకం

విశాలాంధ్ర-గుడివాడ : ఇటీవల విజయవాడలో జరిగిన ఉమ్మడి కృష్ణాజిల్లా బాడీ బిల్డింగ్ పోటీలలో ఎన్టీఆర్ స్టేడియం క్రీడాకారుడు నత్త నితిష్‌కుమార్ 75 కేజీల శరీర బరువు విభాగంలో కంచు పతకం సాధించడం అభినందనీయమాని స్టేడియ కమిటీ సంయుక్తా కార్యదర్శి కిలారపు రంగ ప్రసాద్ అన్నారు. బుధవారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో పతకం సాధించిన నత్త నితీష్‌కుమార్‌ను అభినందించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోచ్ మారెళ్ళ వెంకటేశ్వర రావు, స్టేడియం మేనేజర్ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి ఎమ్మెల్యే కాగిత పట్టు వస్త్రాలు

విశాలాంధ్ర-పెడన : పెడన పట్టణ గ్రామదేవత పైడమ్మ అమ్మ వారిజాతర ఉత్సవాలు బుధవారం ఐదవరోజుకుచేరుకోవటంతో అమ్మ వారికి సాంప్రదాయ బద్ధంగా పట్టు వస్త్రాలు సతి సమేతంగా సమర్పించినట్లు ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ తెలిపారు. మేళ తాళాలతో ఊరేగింపుగా బయలుదేరి సతి సమేతంగా అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజారి కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ కార్య నిర్వహణ అధికారి ఎమ్మెల్యేదంపతులకు పూర్ణకుంభంతో సాదరస్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే దంపతులకు ఘనంగా సన్మానం చేశారు.

భూ సమస్యలు పరిష్కారానికే సదస్సులు

విశాలాంధ్ర-పమిడిముక్కల: రెవిన్యూ సదస్సులతో భూ సమస్యలను, రైతులు ఎదుర్కొంటున్న ఇతర సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తహశీల్దార్ కె.నవీన్ కుమార్ అన్నారు.బుధవారం ఫత్తేలంక లో జరిగిన రెవిన్యూ సదస్సు లో సర్వేసెస్ కి సంబంధించిన నాలుగు అర్జీలు వచ్చాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ సయ్యద్ హిదయతుల్లా డిప్యూటీ తహశీల్దార్ ఏసుపాదం సర్వేయర్ విఆర్వో గ్రామస్తులు పాల్గొన్నారు.

రైతు సదస్సులు సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-పెదపారుపూడి : ప్రజా సమస్యల పరిష్కార వేదిక రైతు సదస్సులను సద్వినియోగించుకోవాలని మండల తహసిల్దార్ వై రంగారావు బుధవారం అన్నారు. మండలంలోని యలమర్రు గ్రామ సచివాలయం ఎదుట రెవెన్యూ సభ జరిగింది. ఈ సభకు పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి, మండల ప్రత్యేక అధికారి డాక్టర్ ఎన్ నరసింహులు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తుల నుండి వివిధ సమస్యలకు సంబంధించిన 31 అర్జీలను ప్రత్యేక అధికారి స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రీ సర్వే డిటి సుందర రావు, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, వీఆర్వోలు రాజాబాబు, దానియేలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ముగిసిన రేషన్ డీలర్‌షిప్ రాత పరీక్షలు

విశాలాంధ్ర-గుడివాడ : స్థానిక రాజేంద్రనగర్లోని మాంటిస్సోరి ఇంగ్లీష్ మీడియం పాఠశాల ప్రాగంణంలో గుడివాడ సబ్ డివిజన్ పరిధిలో నిర్వహించిన రేషన్ డీలర్షిప్ దరఖాస్తుదారుల వ్రాత పరీక్షలు బుధవారం ముగిశాయి. ఈ పరీక్షలను గుడివాడ రెవెన్యూ డివిజనల్ అధికారి బాలసుబ్రహ్మణ్యం తన సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గుడివాడ సబ్ డివిజన్ పరిధిలోని 49 ఖాళీలకు 88మంది దరఖాస్తులు చేసుకోవడం జరిగిందన్నారు. వారిలో తొమ్మిది మంది అనర్హులుగా తిరస్కరించామన్నారు. మిగిలిన 79 మంది దరఖాస్తుదారులకు నేడు నిర్వహించిన పరీక్షల్లో 78 మంది హాజరైనట్లు తెలిపారు.

ఎన్టీఆర్ భరోసా పించన్ పంపిణీ

విశాలాంధ్ర-కూచిపూడి : నవంబరు 21వ తేదీన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ దారుడు మృతి చెందగా అతని పెన్షన్(స్పౌజ్) భార్యకు నెల రోజులు లోపేమంజూరు చేసిన సంఘటన కూచిపూడి లో వెలుగు చూసింది. ఆ గ్రామబదవ వార్డు(మిల్లు బజార్)లో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ తీసుకుంటున్న పరిసేనాగ వెంకట ప్రసాద్ మృతి చెందగాస్పౌజ్ కేటగిరిలోభాగంగాఎన్టీఆర్ భరోసా పెన్షన్ అతని భార్య పరిచయ లక్ష్మీపద్మావతికి అధికారులు మంజూరు చేశారు.ఆమంజూరుపత్రాన్ని గ్రామ సర్పంచ్ కొండవీటి వెంకటరమణ విజయలక్ష్మి లబ్దిదారులుకి అందజేశారు. ఆమెకు జనవరి నెలలో పెన్షన్ అందజేస్తామని వెల్ఫేర్ అంటే ఎడ్యుకేషన్ అసిస్టెంట్ తెలిపారు. ఈకార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి కే పుష్ప నాదం, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ బి ఉమామహేశ్వరరావు, మృతుని కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

గ్రామాల సమస్యల పరిష్కార దిశగా పనిచేద్దాం : ఎంపీపీ

విశాలాంధ్ర-బంటుమిల్లి :- గ్రామాలలో ఉన్న సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిదులు ,అధికారులు సమన్వయంతో పనిచేసి గ్రామాలను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళదామని బంటుమిల్లి మండల ప్రజాపరిషత్ అధ్యక్షులు వెలివెల తారా శశి జ్యోష్న కృష్ణ (చినబాబు) అన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయం నందు బుధవారం మండల ప్రజాపరిషత్ అధ్యక్షులు వెలివెల తారా శశి జ్యోష్న కృష్ణ (చినబాబు) అధ్యక్షతన మండల స్థాయి అధికారులతో సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమవేశంలో మండలస్థాయి అధికారులు వారివారి శాఖల పరంగా జరుగు అభివృద్ధి పనుల గురించి ప్రజాప్రతినిధులకు వివరించారు. గ్రామాలలో త్రాగునీరు ,రహదారులు ,డ్రైనేజి సమస్యలు ప్రధానంగా ఉన్నాయని ,ఎన్ని సార్లు త్రాగునీటి సమస్యపై సర్వసభ్య సమావేశంలో అధికారులకు తెలియపరచినప్పటికీ సమస్య పరిష్కారం మాత్రం ఎక్కడవేసిన గొంగలి అక్కడే ఉన్న చందనా ఉందని ఆయాగ్రామల సర్పంచులు రక్షిత మంచినీటి సరఫర శాఖ అధికారికి వివరించినప్పటికీ ఆ శాఖ అధికారి పొంతనలేని సమాదానాలు చెబుతూ సమావేశం నుండి జారుకున్నారు. లోతట్టు ప్రాంతమైన బంటుమిల్లి జగనన్న కాలనీ లో కొంతమంది మాత్రమే గృహాలు నిర్మించుకున్నారని ,కాలనీలోకి వెల్లడానికి సరైనా రహదారి లేదని ,ఇచ్చిన స్థలాలను మెరక చేయించుకోవాలంటే మట్టి తోలుకోవడానికి ట్రాక్టరు వెళ్లేదారిలేక గృహనిర్మాణ లబ్దిదారులు నానా అవస్తలు పడుతున్నారని,ప్రభుత్వం వెంటనే జగనన్న కాలనీకి రహదారులు ఏర్పటుచేసి కాలనీని మట్టితో మెరక చేయిస్తే లబ్దిదారులు గృహలు నిర్మించుకునే అవకాశాలు కల్పించాలని బంటుమిల్లి 1 సెగ్మెంట్ ఎంపిటిసి సభ్యులు ఎండీ కమల్ భాష అధికారులకు వివరించారు. అనంతరం ఎంపిపి వెలివెల చినబాబు మాట్లాడుతూ మండల పరిదిలోని గ్రామాలలో అవసరమైన చోట రహదారులను ఏర్పాటుచేసుకోవడానికి ప్రభుత్వం ప్రత్యేకంగా ఎన్ఆర్ఇజిఎస్ పథకం నుండి నిధులను కెటాయించడం జరిగిందని అన్నారు .ప్రతి ఒక్కరు పార్టీలకతీతంగా సర్పంచి, గ్రామస్తులు గ్రామసభను ఏర్పాటుచేసుకుని గ్రామాభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి మలిశెట్టి వెంకట రమణ, వైస్ ఎంపిపిలు ఒడిమె చిన్నరిబాబు, కొల్ల లలిత, మండల నీటిసంఘం అధ్యక్షులు బొర్రా కాశీ ,ఎంపిడిఓ నీరజాక్షి, డిప్యూటీ తహశీల్దార్ కాగిత పూర్ణచంద్రరావు, సిడిపిఒ సముద్రవేణి పాల్గొన్నారు.

వృద్ధులకు రగ్గులు పంపిణీ

విశాలాంధ్ర-పెడన: గూడూరు మండలాల పరిధి లోని వృద్దులకు పేరిశెట్టి నాగ రవి ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యం లో బుధవారం రగ్గులు పం పిణీ చేశారు. పెడన గూడూరు పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న వృద్దులకు చలికాలం కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారిని గుర్తించి మొత్తం 130 మందికి రగ్గులు పంపిణీ చేశామని చెప్పారు. పేరిశెట్టి నాగ రవి ఫ్రెండ్ సర్కిల్ మిత్ర బృందం పాల్గొన్నారు.

డిపాజిటర్స్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్నెస్‌పై వర్క్‌షాప్

విశాలాంధ్ర-తుళ్లూరు : తుళ్ళూరు మండల అభివృద్ధి కార్యాలయంలో భారతీయ రిజర్వు బ్యాంకు సౌజన్యంతో, ల్యాంప్ సంస్థ ఆధ్వర్యంలో 'డిపాజిటర్స్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్నెస్'పై ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ల్యాంప్ డైరెక్టర్ కొండపల్లి సాల్మన్‌పాల్ మాట్లాడుతూ ప్రతి వ్యక్తి ఆర్థిక క్రమశిక్షణతో సంపాదనలో 20 శాతం పొదుపు చేయాలని సూచించారు. మహిళలు ఆర్థిక అభివృద్ధిలో ముందుండాలని, బ్యాంకు సేవలను అందరికీ చేరవేయాలని పేర్కొన్నారు. వెలుగు సంస్థ ఏపీఎం కె.చిన వీరయ్య, బరోడా బ్యాంక్ మేనేజర్ ప్రసాద్, రిసోర్స్‌పర్సన్స్ కె.వెంకటేశ్వరరావు, షేక్ బాజీ, తురకా మంగయ్య లాంటి వారు బ్యాంకు పథకాలు, డిజిటల్ సేవలు, మోసాల పట్ల అవగాహన గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో స్వయం సహాయక సంఘాల సభ్యులు, రైతులు, యానిమేటర్లు పాల్గొన్నారు.

కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం రావడం తెలుగువారికి గర్వకారణం: జీవీ

విశాలాంధ్ర - వినుకొండ : ప్రముఖ అభ్యుదయకవి, సీనియర్ న్యాయవాది పెనుగొండ లక్ష్మీనారాయణకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు రావడం తెలుగువారికి, పల్నాడు, వినుకొండకు గర్వకారణమని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. నాలుగున్నర దశాబ్దాలుగా శ్రామికజన పక్షపాతి, అభ్యుదయ రచయితల సంఘంలో వివిధ హోదాల్లో సేవలు అందించడమే కాక ప్రస్తుతం అరసం జాతీయ కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న ఆయనకు ఇంత కాలానికి సముచిత గౌరవం లభించిందన్నారు. లక్ష్మీనారాయణకు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం వచ్చిన సందర్భంగా బుధవారం చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. వినుకొండ నియోజకవర్గంలోని నూజెండ్ల మండలం చెరువు కొమ్ముపాలెం వాసికి ఇలాంటి గుర్తింపు దక్కడం మరింత సంతోషాన్ని కలిగిస్తోందన్నారు. ఈ శుభసందర్భాన లక్ష్మీనారాయణకు మనస్ఫూర్తిగా అభినందనలు అన్న జీవీ, ఆయన కలం నుంచి పేదలు, శ్రామికవర్గాల ఉద్ధరణకు సంబంధించి మరిన్ని అక్షరశరాలు జాలువారాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఆయన ఇలాంటి మరెన్నో అత్యున్నత గౌరవాలు అందుకోవాలని మనస్ఫూర్తిగా కోరుతున్నట్లు తెలిపారు.

పట్టణంలో పరిశుభ్రత పాటించాలని : కమిషనర్

విశాలాంధ్ర - వినుకొండ : వినుకొండ పట్టణంలో ఎల్లవేళలా పరిశుభ్రత పాటించాలని రాష్ట్రంలోనే పారిశుధ్యంలో ఆదర్శవంతంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని వినుకొండ మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ డివైడర్లలో కలుపు మొక్కలను తీయడంపై దృష్టి సారించి రోడ్డు డివైడర్ క్లీనింగ్‌ను పరిశీలించారు. తనిఖీ సందర్భంగా రోడ్డు మార్జిన్ల వెంబడి పరిశుభ్రత పాటించి డివైడర్లు శుభ్రంగా, కలుపు మొక్కలు లేకుండా డివైడర్ల మధ్యలో రోడ్ల పైకి వచ్చిన కొమ్మలను కత్తిరించి శుభ్రంగా ఉండేలా తగు చర్యలు తీసుకోవాలని, వాహనదారులకు దుమ్ము ధూళి నుంచి ఉపశమనం కల్పించాలని కమిషనర్ కార్మికులకు సూచించారు.

కృషి, పట్టుదలతోనే లక్ష్య సాధన : కమిషనర్

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: పట్టుదల, కృషి, ప్లానింగ్ ఉంటేనే లక్ష్య సాధన చేయగలుగుతామని గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. బుధవారం స్థానిక గుజ్జనగుండ్ల సెంటర్‌లోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో 27వ బాలికల ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్‌గేమ్స్ డిస్ట్రిక్ట్ మీట్‌లో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. తొలుత క్రీడాకారుల మార్చ్ ఫాస్ట్ స్వీకరించి, జాతీయ, క్రీడా పతకాలను ఆవిష్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.ఉషారాణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కమిషనర్ మాట్లాడుతూ విద్యార్థులకు తమ భవిష్యత్ లక్ష్య నిర్ధారణ అనేది కీలకమని, లక్ష్య సాధనలో అధ్యాపకుల బోధనలతో పాటు సమగ్ర కృషి ప్రధానమని సూచించారు. లక్ష్య సాధనకు పట్టుదల, కృషి, ప్లానింగ్ తప్ప ఏ విధమైన షార్ట్ కట్‌లు ఉండవని స్పష్టం చేశారు. ప్రస్తుతం పాలిటెక్నిక్ కోర్సులకు ఉజ్వల భవిష్యత్ ఉందని, ప్రతి ఒక్కరూ చదువు పట్ల అంకిత భావం, అధ్యాపకుల పట్ల గౌరవంతో ఉండాలన్నారు. క్రీడల ద్వారా మానసిక, శారీరక ధారుడ్యం కలుగుతుందని, ప్రతి ఒక్కరూ గెలుపోటములను క్రీడాస్పూర్తితో సమభావంగా తీసుకోవాలన్నారు. 1993లో విలేజ్ డెవలప్మెంట్ ఆఫీసర్‌గా ప్రభుత్వ ఉద్యోగంలో చేరి, ప్రస్తుతం ఐఏఎస్ అధికారిగా ఉన్నత స్థాయికి చేరడానికి ఎంతో కృషి చేశానన్నారు. గౌరవ అతిథి మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ టి.రాఘవరావు మాట్లాడుతూ క్రీడలు ప్రతి ఒక్కరికీ అవసరమని, ప్రస్తుతం కార్పొరేట్ విద్యా విధానంలో విద్యార్థులు క్రీడలకు దూరమవుతున్నాయన్నారు. బాలికలకు డిస్ట్రిక్ట్ స్థాయిలో స్పోర్ట్స్ మీట్ ఏర్పాటు ద్వారా వారి ప్రతిభకు వేదిక కల్పించినట్లు అవుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఉషారాణి మాట్లాడుతూ 1968లో ఏర్పడిన మహిళా పాలిటెక్నిక్ కళాశాల బాలికల భవిష్యత్‌కు ఎంతో అండగా నిలిచిందన్నారు. మునిసిపల్ కమిషనర్, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఇరువురూ కళాశాల అభివృద్ధికి చెరొక రూ.20వేలు విరాళం అందచేశారు. అనంతరం అతిధులు వాలీబాల్ ఫ్రెండ్ లీ మ్యాచ్ ఆడి క్రీడలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఐపీఎస్‌జీఎం జిల్లా నోడల్ ఆఫీసర్, ఎం.బి.టి.ఎస్ గవర్నమెంట్ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ టి.శేఖర్, గవర్నమెంట్ టెక్స్టైల్ కాలేజి ప్రిన్సిపాల్ శైలజ , అధ్యాపకులు, పిడిలు పాల్గొన్నారు. ఈ స్పోర్ట్స్ మీట్‌కి జిల్లా వ్యాప్తంగా వివిధ క్రీడల్లో 18 పాలిటెక్నిక్‌ల నుంచి 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

మెప్మా బజార్‌ను ఎంటీఎంసీ అడిషనల్ కమిషనర్ సందర్శన

విశాలాంధ్ర-తాడేపల్లి : తాడేపల్లి పట్టణంలోని కృష్ణుడి గుడివద్ద మెప్మా బజార్‌ను ఎంటీఎంసీ అడిషనల్ కమిషనర్ కంఠమనేని శకుంతల, టీడీపీ పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు ప్రారంభించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయాలకు అనుగుణంగా మెప్మా అధికారుల ఆదేశాల మేరకు స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించి వారు తయారు చేసిన ఉత్పత్తులను పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు, అడిషనల్ కమిషనర్ శకుంతల పరిశీలించారు. అనంతరం వల్లభనేని వెంకట్రావు మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలు సభ్యులు తయారు చేసిన ఉత్పత్తులకు మార్కెటింగ్ చేసుకొనుటకు ప్రభుత్వం అర్బన్ మార్కెటింగ్ ఏర్పాటు చేసిందన్నారు. ఈ ఉత్పత్తులకు పెద్దఎత్తున ప్రజల నుంచి స్పందన లభిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా స్వయం సహాయక సభ్యులు తయారు చేసిన చీరలు, గృహ సామగ్రి వస్తువులు, ఇతర వస్తువులను తయారీ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ కార్యదర్శి దారా దాసు, కేళి వేంకటేశ్వరరావు, చాంద్ బాషా, సంజీవ రెడ్డి, సైదా తదితరులు పాల్గొన్నారు

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర-దాచేపల్లి : మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం జరుగుతుందని ఇన్‌చార్జ్ ఎంపీపీ కందుల జాను, ఎంపీడీవో రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. తాగునీరు, సీజనల్ వ్యాధులతో పాటు శాఖల వారీగా సమీక్ష నిర్వహిస్తారు. సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అన్ని శాఖల అధికారులు విధిగా హాజరుకావాలని కోరారు.

త్రిముఖ వ్యూహాన్ని అనుసరించాలి: వరప్రసాద్

విశాలాంధ్ర- గుంటూరు కలెక్టరేట్ : బంగ్లాదేశ్‌లో అమలుపరుస్తున్న త్రిముఖ వ్యూహాన్ని (నాణ్యత, భద్రత, ప్రపంచ మార్కెట్‌లో సులభ వాణిజ్యం) మనం అనుసరించాలని ఐకార్ - ఐఐఓఆర్ మాజీ డైరక్టర్, అపారి ప్రాజెక్ట్ మేనేజర్ డాక్టర్ కేవీఎస్ వరప్రసాద్ అన్నారు. విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ ఫుడ్ టెక్నాలజీ విభాగంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చరల్ అండ్ హార్టికల్చరల్ సైన్సెస్, అపారి (ఆసియా-పసిఫిక్ అసోసియేషన్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్స్), యూరోపియన్ ప్లాంట్ హెల్త్ రీసెర్చ్ అండ్ కోఆర్డినేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో 'ప్లాంట్ హెల్త్ ఇన్ ఆసియా రీసెర్చ్ ప్రయారిటీస్ అండ్ పార్ట్‌నర్‌షిప్స్' అనే అంశంపై రెండు రోజుల పాటు నిర్వహించిన ఇంటర్నేషనల్ సదస్సును బుధవారం ముగిసింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ కేవీఎస్ వరప్రసాద్ మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో ఎస్‌పీఎస్(శానిటరీ, ఫైటోశానిటరీ) అనేవి వ్యవసాయ ఉత్పత్తులు, ఆహార ఉత్పత్తుల ఆరోగ్యభద్రతను కాపాడటానికి, పర్యావరణ పరిరక్షణకు రూపొందించబడ్డ నిబంధనలని తెలియజేసారు. ఈ విధానాలు అంతర్జాతీయ వాణిజ్యంతో సంబంధం కలిగి ఉంటాయన్నారు. బంగ్లాదేశ్‌లో నాణ్యత, భద్రత, ప్రపంచ మార్కెట్లో సులభ వాణిజ్యాన్ని ప్రోత్సహించేందుకు అమలు చేస్తోందన్నారు. ఇటలీలోని ఐఐపీపీసీ సెక్రటరియట్, ఎఫ్ఏవో ఇంప్లిమెంటేషన్ అండ్ ఫెసిలిటేషన్ లీడ్ డాక్టర్ సారా బ్రూనెల్ మాట్లాడుతూ మొక్కల ఆరోగ్యం అనేది వ్యవసాయం సుస్థిరత, పర్యావరణ పరిరక్షణ, ఆహార భద్రతకు సంబంధించిన ఒక కీలక అంశమన్నారు. ప్రపంచవ్యాప్తంగా మొక్కల వ్యాధులు, కీటకాలు, ఇతర ఆపత్కాల సమస్యలు వ్యవసాయ రంగాన్ని కఠినంగా ప్రభావితం చేస్తూ ఉంటాయన్నారు. సౌత్ ఏసియా సీఏబీఐ ఇంటర్నేషనల్ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ వినోద్ పండిట్ మాట్లాడుతూ సీఏబీఐ ఆధ్వర్యంలో రైతులకు ఎస్‌పీఎస్ ప్రమాణాలపై శిక్షణ కార్యక్రమాలు, ఉత్పత్తి నాణ్యతను మెరుగుపరిచే టెక్నాలజీ పరిచయం, ప్రభుత్వం, ప్రైవేట్ రంగాల భాగస్వామ్యంతో వ్యాపారాన్ని ప్రోత్సహించడం వంటి వాటిపై అవగాహన కల్పిస్తామని అన్నారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వర్సిటీ వైస్ చాన్స్‌లర్ కల్నల్, ప్రొఫెసర్ పి.నాగభూషణ్, ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కారానికి కృషి

విశాలాంధ్ర-దాచేపల్లి : నగర పంచాయతీ పరిధిలోని నడికుడిలో బుధవారం అధికారులు రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. స్థానిక సచివాలయంలో ఏర్పాటు చేసిన ఈ సభలో రైతులు పాల్గొని భూ సమస్యల పరిష్కారానికి వినతిపత్రాలు అందజేశారు. సత్వరమే పరిష్కరించనున్నట్లు తహసీల్దార్ కుటుంబరావు చెప్పారు. టీడీపీ నాయకులు నర్రా పుల్లయ్య, గోళ్ళ నారాయణతో పాటు పలువురు పాల్గొన్నారు.

బాధితులకు జనసేన నేతల ఆర్థిక సాయం

విశాలాంధ్ర-దాచేపల్లి : మండలంలోని జనసేనశాఖ ఆధ్వర్యంలో బుధవారం ఇద్దరికి రూ.11 వేల ఆర్థిక సాయం చేశారు. నడికుడికి చెందిన షేక్ మస్తాన్ వలీకి రూ.5 వేలు, దాచేపల్లికి చెందిన బొమ్మిరెడ్డి రామకృష్ణకు రూ.6 వేలు ఇచ్చారు. మండల శాఖ అధ్యక్షుడు పాముల కిషోర్, నాయకులు ఆవుల శ్రీనివాసరావు, తోట నాగేశ్వర రావు, కానుకొల్లు ప్రశాంత్, కోట మధు, మెగా మహేష్, మొగిలి కృష్ణ, బండ్ల రమేష్, చెరుకూరి క్రాంతి కుమార్, బత్తుల వెంకయ్య, ఆవుల మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామాల్లో ఆధార్ క్యాంపులు

విశాలాంధ్ర-దాచేపల్లి : మండలంలోని పలు గ్రామాల్లో గురువారం నుంచి ఆధార్ క్యాంపులు పెడుతున్నట్లు ఎంపీడీవో రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 19న దాచేపల్లి, 20, 28న కేసానపల్లి, 26, 27న పెదగార్లపాడులో ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ప్రజలను కోరారు.

శాంతి కళ్యాణం

విశాలాంధ్ర-దాచేపల్లి : కృష్ణా నదీ తీరానున్న భట్రుపాలెంలోని శ్రీలక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో ప్రతి నెలా శాంతి కళ్యాణం జరుగుతుందని దేవస్థానం అభివృద్ధి కమిటీ ముఖ్య సలహాదారుడు భూక్యా బాలాజీ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో పీటల మీద కూర్చునే దంపతులు కమిటీని సంప్రదించాలని ఆయన కోరారు.

21న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర-రొంపిచర్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 21న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎండిఓ కె.మ్యాథ్యూబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై, ఇతర అంశాలపై సమీక్ష జరుగుతుందని అన్నారు. ఈ సమావేశంలో మండలంలో ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన కోరారు.

కిశోరి వికాసంపై శిక్షణ

విశాలాంధ్ర-కాకుమాను : స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో కిశోరివికాసంపై శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల భద్రత, ఆరోగ్యం, ఆహారం విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ సుజాతాదేవి, ఏసీడీపీఓ విజయనిర్మల, ఎంఈఓ విజయభాస్కర్, పంచాయతీ కార్యదర్శి డేనియల్, సూపర్‌వైజర్ వెంకాయమ్మ, ఉపాధ్యాయుని రమాదేవి, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుకు 17 అర్జీలు

విశాలాంధ్ర-కాకుమాను : మండల పరిధిలోని గరికపాడు శివారు తెరగాయపాలెం గ్రామంలో బుధవారం తహసీల్దార్ బి.వెంకటస్వామి రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజల నుంచి 17 అర్జీలు అందినట్లు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ప్రియదర్శిని, గ్రామ సర్వేయర్, దేవాదాయ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులో అర్జీల స్వీకరణ

విశాలాంధ్ర-పెదనందిపాడు : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గ్రామ రెవెన్యూ సదస్సులు విజయవంతంగా కొనసాగుతున్నాయి. మండల పరిధిలోని అబ్బినేనిగుంట పాలెం లో తహసీల్దార్ పి.శంకర్ బాబు బుధవారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో ప్రజల నుంచి 8 అర్జీలు అందినట్లు తహసీల్దార్ తెలిపారు. సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఆర్ఐ సాహితి మోహన్, సర్వేయర్ శ్రీనివాసరావు, వీఆర్వో ప్రసాదరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింటు అయిన గుంటూరు జిల్లా, రూరల్(మం), గోరంట్ల గ్రామ డోర్.నెం.2-52 కాపురస్తులైన యలవర్తి శ్రీనివాసరావు గారి భార్య ప్రభావతి గారి సూచనలమేరకు యావన్మందికీ తెలియజేయునది ఏమనగా, నా క్లయింటు పేరిట కొరిటెపాడు సబ్ రిజిస్ట్రార్ వారి కార్యాలయంలో విక్రయ దస్తావేజు నెం: 3129/2014రుగా రిజిస్టరు కాబడిన దస్తావేజు తాలూకు ఆస్తి అనగా గోరంట్ల గ్రామం డి.నెం.324/ఏ లో య.2-87సెంట్లు డి.నెం.327/ఏలో య.3-19శెంట్లు వెరశి ఏక ఖండంగా వున్న య.6-06శెంట్ల భూమిలో వేసిన ప్లాట్లలో ప్లాట్ నెం.57 చ.గ. 200 ఖాళీ నివాస స్థలమును సర్వ సంపూర్ణ హక్కుభుక్తములతో అనుభవించుచున్నారు.అట్టి ఆస్తికి చెందిన ఒరిజినల్ విక్రయ దస్తావేజు నెం:3129/2014 యొక్క ఒరిజినల్ లింకు దస్తావేజు అయిన విక్రయ ద.నెం.4095/2007 యస్.ఆర్.ఓ గుంటూరు లో రిజిస్టర్ కాబడిన దస్తావేజుతో పాటు మరికొన్ని డాక్యు మెంట్లను ఒక కవర్లో పెట్టుకుని జిరాక్స్‌తీయు నిమిత్తం ది.16-11-2024న ఇంటి దగ్గర నుండి గోరంట్ల సెంటరుకు మోటారు సైకిల్ పైన వెళుచుండగా మార్గం మధ్యలో జారిపోయినవి. ఆ చుట్టుపక్కల ఎంత విచారించినను సదరు పై తెలిపిన ఒరిజినల్ లింకు విక్రయ ద.నెం.4095/2007 దస్తావేజు గల కవరు దొరికియుండలేదు. కావున ఎవరికైనా సదరు పై తెలిపిన లింకు దస్తావేజు కలిగిన కవరు దొరికిన యెడల నాకు గాని నా క్లయింటుకు గాని తెచ్చి ఇచ్చిన వారికి తగిన బహుమతి ఇవ్వబడును. అట్లుగాక సదరు లింకు దస్తావేజును ఉపయోగించి ఎవరైనా ఏవిధమైన అన్యాక్రాంతములు జరిపినను నాక్లయింటు తీసుకొను చట్టపరమైన సివిల్ మరియు క్రిమినల్ చర్యలకు బాధ్యులు అగుదురు.

డబ్బూరి వీరాంజనేయులు, అడ్వకేట్,
డోర్ నెం.2-64, వాటర్ ట్యాంక్ దగ్గర, గోరంట్ల, గుంటూరు. సెల్:8885234585

సహకార సంఘాల బకాయిలు 80 శాతం తగ్గించండి : కలెక్టర్

విశాలాంధ్ర-నరసరావుపేట: మార్చి 2025 నాటికి జిల్లాలోని సహకార సంఘాల మొండి బకాయిలను 80 శాతం తగ్గించాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం జిల్లాలోని సహకార సంఘాల మొండి బకాయిలు రూ.50 కోట్లకు మించి ఉన్నాయని, బకాయిలను తగ్గించడం ద్వారానే సంఘాలు బలోపేతం అవుతాయన్నారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో నాల్గవ జిల్లా సహకార సంఘాల అభివృద్ధి కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సహకార సంఘాల అభివృద్ధి పంచవర్ష ప్రణాళికకు ఆమోదం తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి లక్ష్యాలను నిర్దేశించారు. జిల్లాలో సరైన రహదారి లేని 23 సహకార సంఘాల గోడౌన్లకు ద్వామా సహాయంతో రోడ్లు నిర్మించాలన్నారు. నాదెండ్ల మండలంలోని జన్ ఔషధి కేంద్రానికి అదనంగా 4 జన్ ఔషధి కేంద్రాలను ప్రారంభించాలన్నారు. మార్చి నాటికి సహకార సంఘాల నేతృత్వంలో 2 నూతన పెట్రోల్ స్టేషన్లు ప్రారంభించి, 2025-26 ఆర్థిక సంవత్సరంలో మరో 5 పెట్రోల్ స్టేషన్లు, 5 గ్యాస్ స్టేషన్లు నిర్మించాలన్నారు.

కోల్డ్ స్టోరేజీలు, ఎరువుల షాపులు, షాపింగ్ కాంప్లెక్స్‌లు, సూపర్ మార్కెట్ల సంఖ్యను పెంచాలన్నారు. పైలట్ ప్రాజెక్టుగా కారుమంచి, బొగ్గారం, ముప్పాళ్ళ, శావల్యాపురం, అమరావతి, అత్తలూరు గ్రామాల్లో పీఎం సూర్య ఘర్ పథకం ద్వారా 300 యూనిట్లలోపు విద్యుత్ వాడే సహకార సంఘాల సభ్యులకు సోలార్ ప్యానెళ్ల ఏర్పాటుకు రుణం, సబ్సిడీ అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే, జిల్లా సహకార అధికారి వెంకట రమణ, నాబార్డు డీడీఎం శరత్, జిల్లా వ్యవసాయ అధికారి మురళి, పశు సంవర్ధక శాఖ అధికారి కాంతారావు, మత్స్య అధికారి సంజీవ రావు, పంచాయతీ రాజ్ ఏఈ జయకృష్ణ, సహకార బ్యాంకుల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

తంగెడ డీసీ చైర్మన్‌గా పగడాల భాస్కరరావు

విశాలాంధ్ర-దాచేపల్లి : తంగెడ మేజర్ కాల్వ డిస్ట్రిబ్యూటరీ కమిటీ(డీసీ) చైర్మన్‌గా పగడాల భాస్కరరావు, వైస్ చైర్మన్‌గా పాశం చిన్న వెంకటరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ తంగెడ మేజర్ కాల్వ పరిధిలో 11 సంఘాలు ఉన్నాయి. వాటికి ఇటీవల ఎన్నికలు జరగడంతో అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకున్నారు. వారంతా కలిసి తాజాగా 47వ సంఘం దాచేపల్లి ఒకటి నుంచి పగడాల భాస్కరరావు, 52వ సంఘం తంగెడ రెండు నుంచి పాశం చిన్న వెంకటరెడ్డిని చైర్మన్, వైస్ చైర్మన్‌గా ఎన్నుకున్నట్లు ఏఈ పసుపులేటి ఆదినారాయణ, జేఈ దాసరి శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా వారిద్దరూ మాట్లాడుతూ దాచేపల్లి, కారంపూడి, మాచవరం, పిడుగురాళ్ల మండలాల్లో వివిధ గ్రామాల మీదుగా వెళ్లే ఈ కాల్వ 26 కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్నట్లు తెలిపారు. దీని కింద 32 వేల ఎకరాల సాగు భూమి ఉందన్నారు. ఆయకట్టు

చివరి పొలాల వరకు సాగు నీరు వెళ్ళేందుకు పూర్తి స్థాయిలో ఆధునీకరించాలని రూ.1.5 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. నిధులు మంజూరు కాగానే మేజరు, మైనర్ కాల్వల్లో పూడికతీయడంతో పాటు తదితర అభివృద్ధి పనులు చేయనున్నట్లు చెప్పారు. దాచేపల్లికి చెందిన పగడాల భాస్కరరావు టీడీపీ మండల శాఖ కన్వీనర్‌గా రెండు సార్లు, ఉమ్మడి గుంటూరు జిల్లా కమిటీలో రెండు సార్లు కార్యదర్శి పదవి నిర్వహించారు. డీసీ చైర్మన్‌గా ఎన్నికైన భాస్కరరావును పార్టీ శ్రేణులు అభినందించారు.

ఆరోగ్య పరిరక్షణలో దంతాలు కీలక పాత్ర

దాక్టర్ శనక్కాయల రాజకుమారి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : మన ఆరోగ్య పరిరక్షణలో దంతాలు కీలక పాత్ర పోషిస్తాయని టీడీపీ మహిళా నాయకురాలు, అహల్య ట్రస్ట్ డైరెక్టర్ శనక్కాయల రాజకుమారి అన్నారు. స్థానిక ఆర్టీసీ కాలనీ 4వ లైన్‌లో సెయింట్ లారెల్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు విద్యార్థినీలకు అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రష్‌తో పళ్ళను ఏ విధంగా శుభ్రపరచుకోవాలో డాక్టర్ రాజకుమారి విద్యార్థినీలకు స్క్రీన్‌పై తెలియజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ దంత పరిరక్షణలో భాగంగా ప్రతిరోజూ రెండుసార్లు బ్రష్ చేయాలని అన్నారు. దంతాలు, నోరు పరిశుభ్రంగా ఉంటే ఎటువంటి జబ్బులు దరిచేరవని తెలిపారు. దంతాలు ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి ఆరు

నెలలకొకసారి బ్రష్ మార్చాలన్నారు. మనం తీసుకున్న ఆహారం ఆరోగ్యకరంగా పొట్టలోకి పోవాలంటే తొలుత నోరు, దంతాలు పరిశుభ్రంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సెయింట్ లారెల్స్ స్కూలు వ్యవస్థాపకులు మేకల రవీంద్రబాబు, ఎం.సాయి శ్రీకర్, ఎం.భవ్యశ్రీ సాయి, ప్రిన్సిపల్ ఎ.కళ్యాణి, ప్రధానోపాధ్యాయులు కె.మీనాక్షి, ఉపాధ్యాయులు కె.కరుణ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి తోడ్పాటు నివ్వండి : చదలవాడ

విశాలాంధ్ర-నరసరావుపేట: అభివృద్ధిలో నియోజక వర్గాన్ని అగ్రస్థానంలో నిలపాలనే కసితో పరుగులు పెడుతున్నానని, ప్రభుత్వం తరపున తోడ్పాటు అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని నరసరావుపేట ఎమ్మెల్యే డా.చదలవాడ అరవిందబాబు విన్నవించారు. ఈ మేరకు ఉండవల్లి నివాసంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని మర్యాద పూర్వకంగా కలిశారు. అభివృద్ధికి మీరు రోల్ మోడల్, అదే స్ఫూర్తితో నరసరావుపేట నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేయాలనుకుంటున్నట్లు తెలిపారు. ఎన్నో వనరులున్న నరసరావుపేట నియోజక వర్గం గత



పాలకుల నిర్లక్ష్యంతో వెనుకబాటుకు గురైందని వివరించారు. అభివృద్ధికి పెద్దపీట వేసే మీ నాయకత్వంలో నియోజకవర్గాన్ని అభివృద్ధికి దిక్సూచిగా మార్చాలని భావిస్తున్నట్లు వివరించారు.

మధుసూధనరావుకు సత్కారం

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: పొన్నెకల్లు సాగునీటి సంఘ డిస్ట్రిబ్యూటర్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన గుంటుపల్లి మధుసూధనరావు ని జిల్లా టీడీపీ కార్యాలయ కార్యదర్శి కంచర్ల శివరామయ్య బుధవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో దుశ్శాలువతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా శివరామయ్య మాట్లాడుతూ మధుసూధనరావు ఒక రైతు కుటుంబం నుంచి వచ్చి రైతు సమస్యలు తెలిసిన వ్యక్తి అని, 25 సంవత్సరాల సుదీర్ఘ రాజకీయంలో ప్రభుత్వ పార్టీ పదవులు నిర్వహించిన అనుభవంతో ఈ పదవి ద్వారా రైతులకు పూర్తిగా అండగా నిలబడి సాగునీరు సక్రమంగా పొలాలకు అందేవిధంగా కృషి చేయాలన్నారు. మధుసూధనరావు మాట్లాడుతూ నాకు ఈ పదవి రావడానికి సహకరించి ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్, రైతు సోదరులందరికి, పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎద్దూరి హనుమంతరావు, తలశిల ప్రసన్న కుమార్, షేక్ సుభాని, కంచర్ల రత్తయ్య, మోతడక సర్పంచ్ యడ్లపల్లి సాంబశివరావు, గడ్డిపాటి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

డయాలసిస్ పేషెంట్‌కు ఆర్థిక సాయం

విశాలాంధ్ర - వినుకొండ : స్థానిక గాంధీ నగర్ 30వ వార్డు నందు నివసిస్తున్న ఒంటరి మహిళ, కిడ్నీల సమస్యతో బాధపడుతున్న ఎస్.కె మంగమ్మకు గంగినేని ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు గంగినేని రాఘవరావు చేతుల మీదగా 45 రోజులకు సరిపడా నిత్యవసర సరుకులు బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి లగడపాటి శ్రీనివాసరావు, నియోజకవర్గ బీసీ సెల్ నాయకులు భక్తుల గోవిందరాజులు, తెలుగుదేశం పార్టీ నాయకులు బోడపాటి రామారావు, సోమేపల్లి శ్రీనివా సరావు, గుత్త గోవిందయ్య, అశోక్ నాయక్, డేవిడ్ పాల్గొ న్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ మంగమ్మ కిడ్నీ సమస్యతో బాధపడుతుందని డయాలసిస్ చేయవలసి ఉందని, అలానే తమ వంతుగా త్వరలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఈమెకు డయాలసిస్ రోగిగా గుర్తించి ఈమెకు పెన్షన్ సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

కత్తిపోటుకు గురైన వ్యక్తి మృతి

విశాలాంధ్ర-మంగళగిరి : మంగళగిరి పట్టణంలోని రత్నాలచెరువులోని ఎస్టీ కాలనీ నాలుగో లైన్‌లో మంగళవారం రాత్రి జరిగిన ఘటనలో కత్తిపోటు గురైన వ్యక్తి చికిత్సపొం దుతూ మృతి చెందాడు. పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాలుగో లైన్‌లో మహిళ కొట్టు నడుపుకుంటూ ఉంది. జి.శివ అనే వ్యక్తి ఆ మహిళ పట్ల వ్యవహరిస్తున్న తీరును అడ్డుకునేందుకు కె.నాగాంజనేయులు వెళ్లారు. శివ కత్తితో నాగాంజనేయులు కడుపులో పొడవ దంతో తీవ్రంగా గాయపడ్డాడు. గాయ పడిన నాగాంజనేయులు విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ నాగాంజనేయులు మృతి చెందారు. సంఘటనా స్థలాన్ని పట్టణ సీఐ డి.వినోద్ కుమార్ పరిశీలించి, కేసు నమోదు చేశారు.

పొలం పిలుస్తోంది

విశాలాంధ్ర-కాకుమాను : మండల పరిధిలోని బోడిపాలెం, అప్పాపురం గ్రామాలలో బుధవారం మండల వ్యవసాయ శాఖ అధికారిని కె.కిరణ్మయి పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె వరిధాన్యం కల్లాలను పరిశీలించి రైతులకు తగు సూచనలు చేశారు. వీఏఏలు సౌమ్య, మహేందర్ నాయక్, రైతులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

విశాలాంధ్ర- తెనాలి : తెనాలి మున్సిపల్ కమిషనర్ తెనాలి పురపాలక సంఘంలోని 11,16వ వార్డులలో బుధవారం పర్యటించారు. ఆ వార్డులలో వీధివీధిని పరిశీలన చేశారు. అచటనున్న ప్రజలను వారియొక్క సాధక బాధకాలను తెలుసుకున్నారు. వార్డులలో పారిశుధ్య కార్మికులను తాము చేస్తున్న పనులను అడిగి తెలుసుకొని వారికి సలహాలు యిచ్చారు. తెనాలి మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు, శానిటరి ఇన్‌స్పెక్టర్ అనుపమ, నజీర్, సానిటరి సెక్రటరీలు, సహాయ అధికారులు పాల్గొన్నారు. కమిషనర్ ప్రజలతో మాట్లాడుతూ తమ సమస్యలను ఎప్పటికప్పుడు తెలియజేయాలని, అదేరీతిలో వీధులు పరిశుభ్రంగా ఉండేందుకు సహాయ సహకారాలు అందించాలని కోరారు.

20, 21తేదీల్లో క్రీడా పోటీలు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : స్థానిక హిందూ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో ఈ నెల 20, 21 తేదీల్లో 'ఆదర్శ్-2024' రాష్ట్ర స్థాయి అంతర్ ఇంజనీరింగ్ కళాశాలల పోటీలు జరగనున్నట్లు ఆ కళాశాల కార్యదర్శి చెరువు రామకృష్ణ మూర్తి పేర్కొన్నారు. బుధవారం ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో క్రీడా పోటీలకు సంబంధించిన గోడ ప్రతులను ఆవిష్కరించారు. అనంతరం చెరువు రామకృష్ణమూర్తి మాట్లాడుతూ పాటల పోటీల వలన విద్యార్థినీ, విద్యార్థులలో క్రీడా నైపుణ్యాలను పెంపొందించు కోవచ్చన్నారు. అదేవిధంగా వీటివలన శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందని, చదువులో ఏకాగ్రతతో వారు ఎంచుకున్న విజయాలను అందుకోగలుగుతారన్నారు. క్రీడా పోటీలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 20న జరిగే పోటీలను రాష్ట్ర సృజనాత్మకత, సాంస్కృతిక విభాగం కమిషన్ చైర్ పర్సన్ పొడపాటి తేజస్విని ప్రారంభిస్తారని, అలాగే 21న జరిగే బహుమతి ప్రధానోత్సవానికి కేంద్రమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గల్లా మాధవి ముఖ్య అతిథులుగా పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ పి.ఐజక్ ప్రసాద్, వైస్ ప్రిన్సిపల్ వజ్రాల నర్సిరెడ్డి, క్రీడోత్సవాల సమన్వయకర్త డాక్టర్ కెవిఎస్ దుర్గాప్రసాద్, సాంస్కృతిక విభాగాల సమన్వయకర్త కొల్లా సుస్మిత చౌదరి, కృష్ణార్జునరావు, ఫిజికల్ డైరెక్టర్ క్రోసూరు రవి తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **MOHAMMED QURESHI NAZIYA BANU** (Old Name), W/o. **Anwar Mohammed**, Resident of Door No:14-4-73, 4th Line, Pothuri Vari Thota, Guntur - 522001, Guntur District, A.P. I have changed my name as **QURESHI NAZIA BANU** (New Name) W/o. **Anwar Mohammed**. Hereafter my name is known as **QURESHI NAZIA BANU** (New Name) W/o. **Anwar Mohammed**.

రోడ్డు విస్తరణపై విచారణ జరిపించాలని వినతి

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి బుధవారం తన క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏటి అగ్రహారంకు చెందిన ప్రజలు ఎమ్మెల్యేను కలిసి రోడ్డు విస్తరణ పేరుతో గత వైసీపీ ప్రభుత్వ నాయకులు, మునిసిపల్ అధికారులు అవినీతికి పాల్పడి ప్రజల నుంచి పెద్దఎత్తున డబ్బులు వసూలు చేశారని, దీనికి సాక్ష్యం 'మెయిన్ రోడ్డు అష్ట వంకరలు' తిరగటమేనని, రాజకీయ కక్ష సాధింపులో భాగంగా తమ ఇళ్ళకి అవసరం లేకపోయినా మార్కింగ్ వేశారని, అసలు ఈ రోడ్డుకు ఒక వైపు ప్రభుత్వ స్థలం ఉన్నా డబ్బుల కోసం దానిని వదిలేసి, విస్తరణ పేరుతో ఇళ్ళని కూల్చారని ఫిర్యాదు చేశారు. దీని పై గత వైసీపీ ప్రభుత్వ నాయకులు, మునిసిపల్ అధికారుల అవినీతి మీద సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. అనంతరం పార్టీ నేతలతో పార్టీ సభ్యత్వ నమోదు, అదేవిధంగా స్థానిక ప్రజా సమస్యలపై సమావేశం నిర్వ హించి, డివిజన్లలో పారిశుధ్యం, త్రాగునీటి సరఫరా విషయాల్లో అవాం తరాలు ఏమైనా ఏర్పడితే వెంటనే స్పందించి, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. కొంతమంది పెన్షన్లు అధిక కరెంట్ బిల్లు వస్తున్నా యన్న కారణముతో తొలగించారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొని వచ్చారు.

జమిలి ఎన్నికలు సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం :శ్రీనివాసరావు

విశాలాంధ్ర-రెంటచింతల: జమిలి ఎన్నికలు నిర్వహించాలనే కేంద్ర ప్రభుత్వం నిర్ణయం సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని ప్రముఖ విద్యావేత్త నారాయణపురం శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం రెంటచింతలలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడుతూ జమిలి ఎన్నికలతో లాభాల కంటే నష్టాలే అధికమన్నారు. జమిలి ఎన్నికలు ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగ మౌలిక నిర్మాణానికి, సమాఖ్య రాజ్యపాలన పద్ధతికి భంగకరమ న్నారు. ఒకే దేశం-ఒకే ఎన్నిక విధానంతో రాష్ట్రాల స్వయం ప్రతిపత్తి దెబ్బతిని ప్రాంతీయ పార్టీల హక్కులకు భంగం వాటిల్లుతుందన్నారు. కేంద్రంతో పాటు అన్ని రాష్ట్రాల్లో ఒకే పార్టీ ఉండాలనే ఆరాటం, రాజకీయ నియతృత్వం కోసం తపించే రాజకీయ పార్టీలు జమిలి ఎన్నికలను ఓ అస్త్రంగా మలుచుకోవాలని భావిస్తున్నాయని ఆయన విమర్శించారు. భారత రాజ్యాంగంలో ఒకటవ నిబంధనలో భారత దేశాన్ని 'రాష్ట్రాల యూనియన్'గా పేర్కొన్నదని, కేంద్రంతో పాటు రాష్ట్రాలు బలంగా ఉండాలని రాజ్యాంగ నిర్మాతలు ఆశించారన్నారు. దేశం సాధారణ సమయాలలో 'సమాఖ్య రాజ్యాంగం' గా కొనసాగుతుందని డాక్టర్ అంబేద్కర్ పేర్కొన్న విషయాన్ని అందరూ గుర్తించాలన్నారు. సమకాలీన భారతదేశంలో ప్రజలలో ప్రాంతీయ,సామాజిక ఆకాంక్షలు పెరగడంతో ప్రాంతీయ పార్టీలకు ప్రాధాన్యత ఏర్పడిందన్నారు. ప్రజలకు జాతీయ, రాష్ట్రస్థాయిలో స్థానిక ఆకాంక్షలు భిన్నంగా ఉంటాయన్నారు. లోకసభ ఎన్నికలలో ప్రజల ఆకాంక్షలు ఒక రకంగా ఉంటే, శాసనసభ ఎన్నికలలో మరో విధంగా ఉండవచ్చన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో స్థానిక సమస్యలు, అభ్యర్థుల వ్యక్తిత్వాలు ప్రధాన పాత్ర వహిస్తాయన్నారు. అందువల్ల ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసే జమిలి ఎన్నికల విధానాన్ని పార్లమెంటులో వ్యతిరేకించాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు.

సత్తాచాటిన నగర విద్యార్థులు

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : 'యూసీమాస్-2024' పేరుతో ఈ నెల 14, 15 తేదీలలో న్యూఢిల్లీలో జరిగిన ప్రపంచస్థాయి అతిపెద్ద అబాకస్, మెంటల్ అర్థమెటిక్ ఈవెంట్లలో నగరంలోని నగరాలు, చంద్రమౌళినగర్, సంగడిగుంట శాఖల యూసీమాస్ విద్యార్థులు సత్తాచాటారని యూసీమాస్ ఆంధ్రప్రదేశ్ మాస్టర్ ఫ్రాంచేసి, శ్రీ రెయినా టెక్నాలజీస్ చైర్మన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా చంద్రమౌళినగర్ శాఖలో నిర్వహించిన విద్యార్థుల అభినందన సభలో ఏపీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా 30 దేశాల నుంచి 6000 మంది విద్యార్థులు పోటీలో పాల్గొనగా గుంటూరు నగరానికి చెందిన వందేష్ కేవలం ఎనిమిది నిమిషాలలో 200 సమ్స్‌ను సాల్వ్ చేసి ఛాంపియన్‌షిప్‌గా నిలిచారని, గగన రెండవ రన్నర్ అప్, ఆర్యం, కుందన భవ్య చంద్రిక దేవాన్ష్ పర్షిత రేహా్శ్రీ మూడవ రన్నర్ అప్‌లు సాధించి గుంటూరు నగర యూసీమాస్ శాఖల కీర్తి ప్రతిష్టలు ఇనుమడింప చేశారని తెలియజేశారు. కార్యక్రమంలో శ్రీ రేయినా టెక్నాలజీస్ ప్రతినిధులు శ్రీకాంత్, రమ, నందిని, రోషిని, కోమలి పాల్గొన్నారు.

ఘనంగా చంద్ర రాజకుమారి వర్ధంతి

విశాలాంధ్ర, తెనాలి : మహిళా సమాఖ్య జాతీయ నాయకురాలు, చంద్ర రాజకుమారి 6వ వర్ధంతి కార్యక్రమం తెనాలి గాంధీనగర్‌లోని ఇస్కఫ్ కార్యాలయ ఆవరణలో ఇస్కఫ్ ఆధ్వర్యంలో బుధవారం జరిగింది. సభకు ఇస్కఫ్ నాయకురాలు బెజ్జంకి నాగమణి అధ్యక్షత వహించి మాట్లాడుతూ మహిళల పట్ల జరుగుతున్న వివక్షతపై అలుపెరుగని పోరాటాలు చేసిన ఉద్యమనేత అమరజీవి చంద్ర రాజకుమారి మహిళా లోకానికి ఆదర్శమని చెప్పారు. దేశవ్యాప్తంగా మహిళల హక్కుల కోసం రాజకుమారి అవిశ్రాంతంగా పోరాడారని కొనియాడారు. చిన్నతనం నుంచి కమ్యూనిస్టు భావజాలంతో గ్రామస్థాయి నుండి జాతీయ స్థాయి వరకు అనేక సమస్యల పట్ల ఆమె స్పందించిన తీరుతెన్నులను వివరించారు. ప్రత్యేకంగా మైనార్టీ మహిళలకు దేశవ్యాప్తంగా సాగుతున్న హింస హత్యాచారాలు దాడులకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాలలో తీవ్ర పాత్ర వహించారన్నారు. కేవలం మహిళా పోరాటాలకే కాకుండా సమాజంలో వివక్షతకు గురవుతున్న అన్ని వర్గాల ప్రజా పక్షాన ఉద్యమాలు చేశారని గుర్తుచేశారు. అంతర్జాతీయ వేదికగా చర్చకు దారి తీసేలా పోరాటాలు చేసిన ఘనత రాజకుమారికి దక్కుతుందన్నారు. శ్రీదేవి మాట్లాడుతూ సారా, మద్యపానం నిషేధ ఉద్యమాలలో కీలక పాత్ర వహించారని చెప్పారు. రాజకుమారి ఉద్యమ స్ఫూర్తిని అందరూ గ్రహించి ఆమె బాటలో పనిచేయాలని అదే ఆమెకు ఇచ్చే నిజమైన నివాళిగా పేర్కొన్నారు. నటి విజయలక్ష్మి వాల్మీకి మాట్లాడుతూ కళారంగంలో కళాకారులను ఆదరించి వారికి తగిన సలహాలు చెప్పేవారని వాటిని పాటించి సమాజంలో చాలా వరకు మార్పులు వచ్చాయని వివరించారు. ప్రజానాట్యమండలి, శాంతిస్నేహ సంఘాలలో కూడా మహిళలకు ప్రోత్సహించేవారని వారిని స్మరించుకోవడం మహిళా మణుల విద్యుక్త ధర్మమన్నారు. కార్యక్రమ ప్రారంభంలో ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో విజయదుర్గ, యశోధర, వర్ధని, రజని, శివకుమారి, క్యాథరిన్, నీరజ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర-పెదకూరపాడు : మండల కేంద్రమైన పెదకూరపాడు ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం బాల్యవివాహాలపై కిశోర వికాస్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి సభ అధ్యక్షుడిగా ఎంపీడీవో రామకృష్ణ అధ్యక్షత వహించగా 75 తాళ్లూరు శిశు సంక్షేమ శాఖ సూపర్‌వైజర్ ఎస్‌కే మున్ని మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో అంగన్‌వాడీ కార్యకర్తలు అధికారులు ప్రజాప్రతినిధితో కలిసి బాలికలకు 18 సంవత్సరాలు తర్వాతే వివాహాలు చేయాలని కిషోర్ బాలికలకు వారి తల్లిదండ్రులకు సమావేశాలు ఏర్పాటు చేసి బాల్యవివాహాలపై అవగాహన కల్పించాలన్నారు. చట్టానికి వ్యతిరేకంగా బాల్య వివాహాలు ప్రోత్సహించిన వారిని కఠినమైన చర్యలు తీసుకుంటామని ఆమె అన్నారు. అనంతరం వివిధ అంశాలపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఈఓపిఆర్‌డీ శ్రీహరి, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కరాటేలో రోహిత రెడ్డికి ద్వితీయ స్థానం

విశాలాంధ్ర-రెంటచింతల: అండర్-13 కరాటే పోటీలలో రెంటచింతలకు చెందిన విద్యార్థిని గొంటు లక్ష్మీ రోహితారెడ్డి జాతీయ పోటీలలో రెండోస్థానం సాధించింది. ఈనెల 14,15 తేదీలలో న్యూఢిల్లీలోని తల్కాటోరా ఇండోర్ స్టేడియంలో కరాటే ఇండియా ఆర్గనైజేషన్ పోటీలను నిర్వహించింది. ఆ పోటీలలో సిల్వర్ స్థానంలో విజయాన్ని వరించింది. గత ఆగష్టులో చెన్నైలో జరిగిన పోటీలలో మూడోస్థానం, జులైలో ఢిల్లీలో జరిగిన పోటీలతో రెండోస్థానం కైవసం చేసుకున్నట్లు తండ్రి గొంటు రవి కిరణ్ రెడ్డి వెల్లడించారు. గతంలో హైదరాబాద్, నల్గొండలలో జరిగిన క్రీడలలో ఆరుసార్లు అవార్డు పొందింది. రోహితారెడ్డి ప్రపంచస్థాయి పోటీలలో ఇండియా తరపున ఆడేందుకు అర్హత సాధించినందుకు మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి, గొంటు సుమంత్ రెడ్డి, గొంటు ఆదిరెడ్డి అభినందనలు తెలిపారు.

ఉపాధ్యాయులపై సస్పెన్షన్ ఎత్తివేత

విశాలాంధ్ర-నరసరావుపేట: సార్వత్రిక ఎన్నికల్లో మాచర్ల పాల్వాయి గేటు బూత్ నెంబర్ 2 సంఘటనలో సస్పెన్షన్‌కు గురైన పీఓ, ఏపీఓల సస్పెన్షన్ ఎత్తివేస్తూ పల్నాడు కలెక్టరేట్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అక్రమంగా పోలింగ్ బూత్‌లోకి వెళ్లి ఈవీఎంలను ధ్వంసం చేశారు. ఆనాటి ఉన్నతాధికారులు ఆ భయానక వాతావరణంలో కేవలం పీఓ, ఏపీఓలనే పూర్తి బాధ్యుల్ని చేసి సస్పెండ్ చేశారు. పల్నాడు ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ఉపాధ్యాయులపై సస్పెన్షన్ ఎత్తివేయాలని కలెక్టరేట్‌కు, ఎలక్షన్ కమీషన్‌కు పలుమార్లు విన్నవించారు. దీంతో జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు, డిఆర్ఓ మురళీలు నిష్పాక్షిక విచారణను చేపట్టి ఉపాధ్యాయులకు న్యాయం జరిగేటట్లు చర్యలు తీసుకొని వారిపై సస్పెన్షన్ను ఎత్తివేశారు. ఉపాధ్యాయులకు న్యాయం చేసిన పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు, డీఆర్వో మురళి కి పల్నాడు ఫ్యాప్టో పక్షాన ధన్యవాదాలు తెలుపుతున్నట్లు ఫ్యాప్టో పల్నాడు చైర్మన్ బెజ్జం సంపత్ బాబు, సెక్రటరీ జనరల్ వి.అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు.

మెప్మా బజార్ అర్బన్ మార్కెట్ ప్రారంభం

విశాలాంధ్ర-మంగళగిరి : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన మెప్మా బజార్ అర్బన్ మార్కెట్‌ను కమిషనర్ ఆలీం భాష, టీడీపీ గుంటూరు పార్లమెంట్ కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావులు బుధవారం ప్రారంభించారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆశయాలకు అనుగుణంగా స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించారు. వారు తయారుచేసిన ఉత్పత్తులను ప్రదర్శనలలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ కె.శకుంతల, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.విజయ లక్ష్మి కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా అనంతరం పోతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలు సభ్యులు తయారు చేసిన ఉత్పత్తులకు మార్కెటింగ్ చేసుకొనుటకు ప్రభుత్వం అర్బన్ మార్కెటింగ్ ఏర్పాటు చేసిందన్నారు. ఈ ఉత్పత్తులకు పెద్దఎత్తున ప్రజల నుంచి స్పందన లభిస్తుందన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘ సభ్యులు మెప్మా ద్వారా వివిధ బ్యాంకుల నుంచి

రుణములు తీసుకొని ఇంటి వద్దే ఉత్పత్తులను తయారుచేసుకొని చిన్న చిన్న వ్యాపారాలు చేసుకోవడం జరుగుతున్నదని ప్రతి నెల రెండు రోజులు మెప్మా అర్బన్ మార్కెట్‌ను నిర్వహిస్తామని తెలిపారు. స్వయం సహాయక సభ్యులు తయారు చేసిన చీరలు, గృహ సామగ్రి వస్తువులు, ఇతర వస్తువులను ఆసక్తిగా తిలకించిన అనంతరం తయారీ విధానాన్ని స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ ఉపాధ్యక్షుడు గోవాడ దుర్గారావు, తెలుగు మహిళా అధ్యక్షురాలు ఆర్ద్ర భులక్ష్మి, తెలుగు మహిళా కార్యనిర్వాహణ కార్యదర్శి వింజమూరి బాల, పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు వాక మాధవరావు, మిషన్ మేనేజర్ మాలతి తదితరులు పాల్గొన్నారు.

పెనుగొండ కృషి స్ఫూర్తిదాయకం

అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివప్రసాద్

విశాలాంధ్ర-గుంటూరు

కలెక్టరేట్ : అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ 'దీపిక' అభ్యుదయ వ్యాసాల సంపుటికి కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు ప్రకటించిన సందర్భంగా అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్, కార్యదర్శి కె.శరచ్చంద్ర జ్యోతిశ్రీ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఆయన గత 50 ఏళ్ళుగా అభ్యుదయ సాహిత్య వికాసానికి తెలుగునాట చేస్తున్న కృషికి తగిన గుర్తింపుగా.. అభ్యుదయ సాహిత్యానికి దక్కిన గౌరవంగా భావిస్తున్నామన్నారు. అరసంలో 1973లో సాధారణ కార్యకర్తగా మొదలైన పెనుగొండ లక్ష్మీనారాయణ అభ్యుదయ సాహిత్య ప్రస్థానం, అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, అధ్యక్షుడిగా నేడు అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్ష స్థానం వరకు కొనసాగడం విశేషమని అన్నారు. విలక్షణమైన విమర్శకుడిగా పెనుగొండ కృషి అభ్యుదయ సాహిత్యకారులకు ఎంతో స్ఫూర్తిదాయకమని అన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని వినతి

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్, మోటార్ వాహన కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ పెన్షన్‌తో కూడిన సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయడానికి కృషి చేయాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్‌ను ఆటో యూనియన్ (ఏఐటీయూసీ) నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్యేను కలిసి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ భారీగా జరిమానాలు పెంచే జీఓ 21, 31 రద్దు చేయాలని కోరారు. డ్రైవర్‌కు వాహన మిత్ర వెంటనే అమలు చేయాలని అన్నారు. అదేవిధంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆటో డ్రైవర్స్, మోటార్ కార్మికులకు రూ.15 వేలు సంవత్సరానికి ఆర్థిక సహాయం ఇస్తామని చెప్పిందని, తక్షణమే ఆ హామీ అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ది గుంటూరు నగర ఆటో వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) నగర అధ్యక్ష, కార్యదర్శులు కూరాకుల రామ్‌ప్రసాద్, మంగా శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి బాబర్, నాయకులు జయరామ్, శ్రీను, కోటి, జావీద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వైర్లు చోరీ

విశాలాంధ్ర-దాచేపల్లి : స్థానిక పంట పొలాల్లో రైతులకు సంబంధించిన వ్యవసాయ కనెక్షన్లకు చెందిన ట్రాన్స్‌ఫారంలో ఉండే రూ.1.40 లక్షల విలువ కలిగిన విద్యుత్ వైరును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకు పోయారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రైతు లాలు నాగులవలీ పొలంలో రూ.30 వేలు, వడిశాల రమణమ్మ, ఆరికట్ల బ్రహ్మారెడ్డి పొలంలో రూ.1.10 లక్షల విలువ కలిగిన విద్యుత్ వైరును చోరీచేశారు. దీనిపై విద్యుత్ అధికారులు బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పాపారావు తెలిపారు.

హిందూ ఫార్మశిలో బి ఫార్మశి, ఫార్మా డి తరగతులు ప్రారంభం

- ఫార్మశి నిపుణులకు ఉపాధి అవకాశాలు ఎక్కువ
- కళాశాల గౌరవ చైర్మన్ డాక్టర్ మన్నవ రాధాకృష్ణమూర్తి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఫార్మశి నిపుణులకు ఇండస్ట్రియల్ ఫార్మశి, క్లినికల్ రీసెర్చ్, కమ్యూనిటీ ఫార్మశిలో ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని హిందూ ఫార్మశి కళాశాల గౌరవ చైర్మన్ డాక్టర్ మన్నవ రాధాకృష్ణ మూర్తి అన్నారు. అమరావతి రోడ్డుల ఉన్న హిందూ ఫార్మశి కళాశాల నందు బి.ఫార్మశి, ఫార్మా.డి మొదటి సంవత్సరం తరగతులు బుధవారం ప్రారంభమైయ్యాయి. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు తమ కళాశాలలో చేరిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు అభినందనలు తెలియజేశారు. హిందూ కాలేజీ, హైస్కూల్ కౌన్సిల్ సొసైటీ తరుపున ప్రారంభించిన వివిధ కళాశాలల గురించి వివరించారు. తాము ఎంచుకున్న రంగంలో తమ గమ్యాన్ని నిర్ధారించుకుని సాధించటానికి క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని విద్యార్థులను కోరారు. కళాశాల గౌరవ చైర్మన్ డాక్టర్ మన్నవ రాధాకృష్ణ మూర్తి మాట్లాడుతూ మన దేశంలో ప్రస్తుతం 4వేల

ఫార్మశి కళాశాలలు ఉన్నాయని, వాటి స్థాపనకు కృషి చేసిన డాక్టర్ మహదేవలాల్ ష్రాఫ్, డాక్టర్ మదన్ మోహన్ మాలవ్యలను తెలుసుకుని స్ఫూర్తి పొందాలన్నారు. ఔషధ రంగంలో పరిశోధనలు చేసిన ఎటరథాన్, ఫోలిక్ యాసిడ్, టెట్రా సైక్లిన్ లాంటి ఔషధాలను కనుగొన్న డాక్టర్ ఎల్లా ప్రగడ సుబ్బారావు జీవిత చరిత్రను తెలుసుకుని స్ఫూర్తి పొందాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ ఎస్.మధుసూధనరావు, ప్రిన్సిపల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.ప్రత్యూష, ఫార్మా.డి డైరెక్టర్ పి.సీతారామయ్య, జి.ఇందిరా ప్రియదర్శిని, వి.మౌనిక తదితరులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర-చిలకలూరిపేట : రైతులు రానున్న వర్షాల పట్ల అప్రమత్తంగా వ్యవహించి పంటను కాపాడుకోవాలని మండల వ్యవసాయాధికారి టి.శ్రీలత సూచించారు. బుధవారం చిలకలూరిపేట మండలం కుక్కపల్లివారిపాలెం వేలూరు గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏవో మాట్లాడుతూ రాబోవు రెండు మూడు రోజుల్లో వర్ష సూచన ఉందని, వరి పంట వేసిన రైతులు వర్ష పరిస్థితులను చూసి పంట కోత చేయరాదని, ఇప్పటికే పంట కోత చేసిన రైతులు పంటను సురక్షిత ప్రాంతాల్లో నిల్వ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి జీపీ శ్రీనివాసరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

తెలుగు సాహితీ యాత్ర స్థలాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం

విశాలాంధ్ర-చిలకలూరిపేట : పర్యాటకంలో భాగంగా తెలుగు సాహితీ యాత్ర స్థలాలు అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయడం తెలుగుభాషపై, సాహిత్యంపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ఉన్న అపారమైన అభిమానానికి నిదర్శమని జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్ర కో-కన్వీనర్ పెంటేల బాలాజీ చెప్పారు. బుధవారం ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ప్రజలను ముందుకు నడిపించడంలో.. చైతన్యపరచడంలో సాహిత్యానిదే కీలకపాత్రని అటువంటి సాహిత్యంతో సన్నిహితంగా ఉండటం జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు ముందు నుంచి ఉన్న అలవాటని తెలిపారు. ఈ దిశగానే మాతృ భాషపట్ల నవతరంలోనూ, చిన్నారుల్లోనూ ప్రేమాభిమానాలు పెంచడంతోపాటు- మన కవులు, రచయితల గొప్పదనాన్ని తెలియచేసేలా తెలుగు సాహితీ యాత్రలు నిర్వహించే దిశగా ప్రణాళికలు సిద్ధం చేస్తామని ప్రకటించటం అభినందనీయమన్నారు.

ఎయిమ్స్‌కు అవయవదానానికి దంపతుల అంగీకారం

విశాలాంధ్ర-మంగళగిరి : గుంటూరు జిల్లా, దుగ్గిరాల మండలం, వీర్లపాలెం గ్రామానికి చెందిన రైతు ఈమని వెంకటరెడ్డి, వారి సతీమణి సాహితీ శారద తమ మరణానంతరం మొత్తంబాడీని ఎయిమ్స్ హాస్పిటల్‌కు బుధవారం దానంగా రాసి ఇచ్చారు. ఆ దంపతులు ఎయిమ్స్‌కు రాసి ఇచ్చిన పత్రాలను అఖిల భారత శరీర అవయవ దాన సంఘం, గుంటూరు జిల్లా కార్యదర్శి, మంగళగిరి నివాసి రేకా నర్మద అందచేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో మహాదాత ఈమని వెంకటరెడ్డి మాట్లాడుతూ మరణానంతరం పార్థివదేహాన్ని బూడిద చేయకుండా ఏదైనా మెడికల్ కళాశాలకు ఆ నిర్జీవదేహాన్ని దానం చేయటం వల్ల ఎంతో మందికి, ఆ శరీరంలోని అవయవాలు ఉపయోగపడతాయని చెప్పారు. అఖిల భారత శరీర అవయవదాన సంఘం, గుంటూరు జిల్లా కార్యదర్శి రేకా నర్మద, ఈమని వెంకటరెడ్డి దంపతులు సమాజానికి ఆదర్శంగా నిలిచారని ఎంతగానో అభినందించారు. మంగళగిరి బుద్ధ విహార అధ్యక్షుడు రేకా కృష్ణార్జునరావు మాట్లాడుతూ... అందరూ ఈమని వెంకటరెడ్డి లాగా చైతన్యవంతులు కావాలని కోరారు. మెడికల్ కళాశాలకు తగినన్ని పార్థివదేహాలు అందినప్పుడు, వైద్య పరిశోధనలు బాగా జరిగి, వ్యాధుల నిర్మూలనకు కొత్త ఆవిష్కరణలు జరుగుతాయని చెప్పారు.

అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర-మంగళగిరి : ఐటీ, విద్య శాఖల మంత్రి నారా లోకేష్ స్ఫూర్తితో ఆత్మకూరులోని కొత్తపేటలో కోకాకోలా కంపెనీ సౌజన్యంతో ఆధునికీకరించిన అంగన్‌వాడీ కేంద్రంను ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ బుధవారం స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ మాట్లాడుతూ మంత్రి లోకేష్ ఆదేశాలతో అంగన్‌వాడీ కేంద్రంను ప్రారంభించినట్లు చెప్పారు. కోకా కోలా కంపెనీ వారి సౌజన్యంతో రూ.6 లక్షలతో అంగన్‌వాడీ కేంద్రంను నూతనంగా ఆధునికీకరించి అన్నిరకాల మౌలిక సదుపాయాలను కల్పించడం జరిగిందన్నారు. అంగన్‌వాడీ టీచర్లు అంటే తల్లి తర్వాత తల్లి లాంటి వారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అంగన్‌వాడీలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం జరుగుతుందని అన్నారు. టీడీపీ హయంలోనే 18,301 అంగన్‌వాడీ కేంద్రాలు కట్టించినట్లు తెలిపారు. టీడీపీ హయంలో రూ.4200లుగా ఉన్న అంగన్‌వాడీల

జీతాలను రూ.10,500లకు పెంచిన ఘనత సీఎం చంద్రబాబు నాయుడిదేనన్నారు. మంత్రి నారా లోకేష్ చొరవతో మంగళగిరి నియోజకవర్గంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్ల, పోషణ, వర్షపు నీటి నిర్వహణ, మొక్కలు పెంపకం, మౌలిక సదుపాయాలు వంటి మరమ్మతు పనులు చేపట్టడం జరిగిందన్నారు. గుంటూరు జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ కె.విజయలక్ష్మి, రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారథి, మండల ప్రధాన కార్యదర్శి మల్లర్శి మల్లవరపు వెంకట్రావు, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి గుత్తికొండ ధనుంజయరావు, సీనియర్ నాయకులు కొమ్మా లవ్‌కుమార్, మండల కమిటీ ఉపాధ్యక్షులు కొమ్మా సుకుమార్, గ్రామ పార్టీ అధ్యక్షులు తాటి వెంకట్రావు, సీపీడీఓ ఏ.సులోచన, సూపర్‌వైజర్ భవాని పాల్గొన్నారు.

అభివృద్ధికి కేరాఫ్‌గా ఆంధ్రప్రదేశ్

విశాలాంధ్ర-విజయపురిసౌత్ : అభివృద్ధికి కేరాఫ్‌గా ఆంధ్రప్రదేశ్ నిలిచిందని తెలుగుదేశం పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.ధారునాయక్ అన్నారు. బుధవారం విజయపురి సౌత్‌లోని దేశవరపు క్యాంపు తండాలో శ్రీ మాతా జగదాంబ, అభయాంజనేయ స్వామి, సద్గురు సేవాలాల్ మహరాజ్ ఆలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని పూజలు నిర్వహిం చారు. కార్యక్రమంలో వీపీ సౌత్ టీడీపీ అధ్యక్షుడు బొల్లా వెంకటేశ్వర్లు చౌదరి, వజ్రం నాయక్, డాక్టర్ ఎన్.బసిరెడ్డి, సత్తిబాబు, ఎమ్మార్పీఎస్ నాయకుడు ఊరే మార్క్ శ్రీరామూర్తి, పాండు నాయక్, స్వామి నాయక్, పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

విశాలాంధ్ర, తెనాలి : తెనాలి ఆర్టీసి డిపో ఆధ్వర్యంలో నేడు (గురువారం) డయల్ యువర్ డీఎం కార్యక్రమం ఉదయం 10.30 నుంచి 11.30 వరకు నిర్వహించనున్నట్లు తెనాలి డిపో మేనేజర్ ఒక ప్రకటనలో తెలిపారు. తెనాలి పట్టణ పరిసర గ్రామస్తులు ప్రయాణికులు ఈ కార్య క్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

మహిళలు సాధికారతను సాధించాలి

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): మహిళలు అన్ని రంగాల్లో సాధికారతను సాధించాలని సీఐఐ ఇండియన్ ఉమెన్ నెట్‌వర్క్ వైస్‌ఛైర్మన్ చంద్రిని చందనా ఆకుల అన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో కళాశాల ఉమెన్ ఆఫ్ వర్త్ (డబ్ల్యూఓడబ్ల్యూ) క్లబ్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఆ కళాశాల ప్రాంగణంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన చంద్రిని చందనా ఆకుల మాట్లాడుతూ విద్యార్థినులు సమాజంలో ఉన్నతంగా ఎదగటానికి కృషి చేయాలన్నారు. ఇతరులకు స్ఫూర్తినిచ్చే దిశగా అడుగులు వేయాలని సూచించారు. నూతన క్లబ్ ద్వారా మరిన్ని కార్యక్రమాలను నిర్వహించి అన్ని రంగాల్లో ముందడుగు వేసేందుకు కావాల్సిన శక్తియుక్తులను పొందాలని సూచించారు. విద్యార్థినులు ధైర్యంగా తాము ఎంచుకున్న రంగాల్లోకి అడుగులు వేయాలని కోరారు. తొలుత జరిగిన ర్యాంప్‌వాక్, మిస్ ఉమెన్‌లీడర్ తదితర పోటీల విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్, కోశాధికారి కాజా రాఘవయ్య, సహాయ కార్యదర్శి గ్రంధి పవన్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ శరవణకుమార్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సురేష్‌బాబు, క్లబ్ కోఆర్డినేటర్ నవ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

'పినాకిల్'ను ఆవిష్కరించిన లీడ్ గ్రూప్

విశాలాంధ్ర-విజయవాడ లబ్బీపేట : ఎడ్‌టెక్ మార్గదర్శకులైన లీడ్ గ్రూప్, పినాకిల్‌ను ప్రారంభించినట్లు సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇది పూర్తిస్థాయిలో పరిశోధించబడిన పాఠ్యాంశాలు, బోధనా శాస్త్రం, కంటెంట్‌ను మిళితం చేసే మొట్ట మొదటి, ఆధునిక పాఠ్య ప్రణాళిక పరిష్కారమన్నారు. విద్యార్థులకు నిజమైన మల్టీ -మోడల్, వ్యక్తిగతీకరించిన అనుకూలమైన అభ్యాస అనుభవాన్ని అందించడానికి ఏఐ ఇతర అధునాతన విద్యా సాంకేతికతలను మిళితం చేస్తుందనారు. రాబోయే 3 సంవత్సరాలలో, పినాకిల్ లీడ్ గ్రూప్ యొక్క మొత్తం రాబడిలో 40 శాతం దోహదపడుతుందని అంచనా వేయబడిందనారు. పినాకిల్ యొక్క లోతుగా పరిశోధించిన పరిష్కారాలు ముందుకు తీసుకువెళ్ళే (ప్రోపల్సివ్) విద్య కోసం ఈ పెరుగుతున్న తల్లిదండ్రుల డిమాండ్‌ను తీరుస్తాయన్నారు. లీడ్ గ్రూప్ సీఈఓ, సహ వ్యవస్థాపకుడు సుమీత్ మెహతా మాట్లాడుతూ, "పినాకిల్ రెండు సంవత్సరాల కంటే ఎక్కువ పరిశోధన మరియు దేశవ్యాప్తంగా పాఠశాలల సహకారం నుండి వచ్చిన పరిజానంతో నిర్మించబడిందనారు. పాఠ్యాంశాలు, బోధనాశాస్త్రం సాంకేతికతలో అత్యుత్తమమైన ఎన్ సి ఎఫ్ 2023 తో పూర్తిగా సమలేఖనం చేయబడిందన్నారు. ఇది భారతదేశంలోని పాఠశాల విద్యలో మొదటిది ప్రాథమికంగా పుస్తకాలు లేదా స్వతంత్ర సాఫ్ట్‌వేర్ లేదా స్మార్ట్ క్లాస్‌రూమ్ కంటెంట్‌పై దృష్టి సారించిన సాంప్రదాయ విధానాల నుండి గణనీయమైన మార్పును సూచిస్తోందన్నారు.

నగరంలో వైభవంగా ప్రారంభమైన 'హైలైఫ్ ఎగ్జిబిషన్'

విశాలాంధ్ర-విజయవాడ లబ్బీపేట : హైలైఫ్ ఎగ్జిబిషన్ నగరంలోని నోవోటెల్ వరుణ్ హోటల్ లో వైభవంగా ప్రారంభమైంది. ఫ్యాషన్, జ్యూవెలరీ, వెడ్డింగ్ షాపింగ్, లగ్జరీ, లైఫ్‌స్టైల్ సహా విభిన్న విభాగాల కోసం జరిగే ప్రదర్శనలో అతిపెద్దదనారు. హై లైఫ్ ఎగ్జిబిషన్ లో క్రియేటివ్ డిజైనర్ వేర్, చీరలు, వెడ్డింగ్ వేర్, బ్రైడల్ వేర్, వెడ్డింగ్ జ్యూవెలరీ, వెడ్డింగ్ చీరలు, ఫ్యాషన్ లైఫ్‌స్టైల్ యొక్క ప్రత్యేక ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నారన్నారు. ప్రదర్శనలో ప్రముఖ డిజైనర్లు, జ్యూవెల్లర్లు, ఫ్యాషన్ లేబుల్‌లు ప్రదర్శించనున్నారన్నారు. వివిధ దేశాలలో ఎక్కువ మంది ఇష్టపడే ఎగ్జిబిషన్ బ్రాండ్ గా , అతిపెద్ద ఎగ్జిబిషన్ బ్రాండ్‌లో ఒకటిగా సృజనాత్మక ఫ్యాషన్‌లు, ట్రెండింగ్ డిజైనర్ దుస్తులు, ప్రత్యేకమైన జీవనశైలి ఉత్పత్తులు, ఆభరణాలు మరెన్నో హై లైఫ్ అందిస్తుందన్నారు. ఈ సందర్భంగా హై లైఫ్ ఎగ్జిబిషన్ ఎండి సీఈఓ శ్రీ అబి. పి. డొమినిక్ మాట్లాడుతూ " ఇది వినూత్నమైన ప్రదర్శన. డిజైనర్ ఫ్యాషన్‌లు, ట్రెండీ ఫ్యాషన్ వేర్, వెడ్డింగ్ ఫ్యాషన్‌లు, జ్యూవెలరీ, బ్రైడల్ ఫ్యాషన్ ఎసెన్షియల్స్, ఫ్యాషన్ %d% జీవనశైలి ఉత్పత్తులు వంటి ప్రత్యేక ప్రదర్శనలను ఇది కలిగి ఉందన్నారు. ఫ్యాషన్ డిజైనర్ల నుండి తాజా కలెక్షన్ , ఫ్యాషన్ లేబుల్‌లు మరిన్ని ఇక్కడ ప్రదర్శించనున్నాము" అని అన్నారు

స్టార్ ఆరోగ్య డిజి సేవను ఆవిష్కరించిన స్టార్ హెల్త్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): దిగ్గజ భారతీయ రిటైల్ హెల్త్ ఇన్సూరెన్స్ సంస్థ స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్, సెంటర్ ఫర్ క్రానిక్ డిసీజ్ అండ్ కంట్రోల్ (సీసీడీసీ) భాగస్వామ్యంతో తమ వినూత్నమైన సీఎస్ఆర్ కార్యక్రమం స్టార్ ఆరోగ్య డిజి సేవను ఆవిష్కరించినట్లు ప్రకటించింది. ఆరోగ్య సేవలు, అంతగా లేదా అస్సలు అందని మారుమూల ప్రాంతాల్లోనూ కీలకమైన వైద్య సర్వీసులను అందుబాటులోకి తెచ్చే దిశగా టెలిమెడిసిన్, మొబైల్ హెల్త్ యూనిట్ల సామర్థ్యాలను మేళవించడం ద్వారా గ్రామీణ కమ్యూనిటీల్లో ఆరోగ్య సంరక్షణకు సంబంధించిన అంతరాలను భర్తీ చేయాలనేది ఈ కార్యక్రమం లక్ష్యం. ముందుగా ఆంధ్రప్రదేశ్‌లోని నాలుగు యాస్పిరేషనల్ జిల్లాలైన విశాఖపట్నం, అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళంలోని 44 గ్రామాల్లో ఈ కార్యక్రమం అమలు చేయబడుతుంది. మధుమేహం, హైపర్‌టెన్షన్ వంటి వ్యాప్తి చెందని వ్యాధులకు సంబంధించి ప్రివెంటివ్ హెల్త్‌కేర్, నిర్వహణపై ప్రధానంగా దృష్టి పెడుతుంది.

కొత్తపేటలో లక్కీ రెస్టారెంట్ ప్రారంభం

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): విజయవాడ కొత్తపేట కోమల విలాస్ సెంటర్లో లక్కీ రెస్టారెంట్ అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. బుధవారం లక్కీ రెస్టారెంట్ ను విజయవాడ నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి లాంఛనంగా ప్రారంభించారు. ఇరానీ చాయ్ కౌంటర్ ను షేక్ ఫాతిమా బేగం , క్యాష్ కౌంటర్ ను గుడేల శ్యాం కుమార్- జ్యోతిక కళ్యాణి దంపతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ వన్ టౌన్ ప్రాంతంలో లక్కీ రెస్టారెంట్ ప్రారంభం కావడం అభినందనీయమని అన్నారు. చక్కటి ఆహార పదార్థాలను అందజేసి ఈ ప్రాంతం పేరును లక్కీ రెస్టారెంట్ సెంటర్ గా పిలుచుకునేంతగా ప్రజలకు చేరువ కావాలని నిర్వాహకులకు సూచించారు. లక్కీ రెస్టారెంట్ ప్రొప్రైయిటర్లు షేక్ ఖాజా మొహినుద్దీన్, రాళ్లపల్లి లక్ష్మీ మాట్లాడుతూ వన్ టౌన్ ప్రాంత ప్రజలకు చక్కటి రుచికరమైన ఆహార పదార్థాలను అందజేయాలనే లక్ష్యంతో తాము లక్కీ రెస్టారెంట్ ను ప్రారంభించడం జరిగిందని చెప్పారు. అందరికీ అందుబాటు ధరలలో వెజ్, నాన్ వెజ్ బిర్యానీలు, షవర్మ, గ్రిల్ చికెన్, వివిధ రకాల టిఫిన్లు, ఇరానీ చాయ్, తదితర ఆహార పదార్థాలను రుచికరంగా, పరిశుభ్రమైన వాతావరణంలో ప్రజలకు అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. లక్కీ రెస్టారెంట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కార్పొరేటర్లు మహదేవు అప్పాజీ రావు, మరుపిళ్ల రాజేష్, ఉమ్మడి చంటి, మండే పూడి ఛటర్జీ, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పోతిన వెంకట మహేష్, పోతిన బేసు కంటేశ్వరుడు, రాయన నరేంద్ర, అత్తులూరి పెద్దబాబు, మైలవరపు దుర్గారావు, సగురుపిళ్ల రమేష్, పైలా పాపారావు, దేరంగుల రమణ, పోతిన అవినాష్, పిళ్లా సూరిబాబు (జగ్గు), మజ్జి శ్రీను,లింగిపల్లి రామకృష్ణ, ఈది పార్వతి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో 'సంక్రాంతి శోభ'

విశాలాంధ్ర-కూచిపూడి : గ్రామాలలో సంక్రాంతి శోభ, సందడి ప్రారంభమైంది. ధనుర్మాసంతోపాటుసంక్రాంతి నెల కూడా ప్రారంభం కావడంతో గ్రామాల్లోనిముంగిళ్లు ముగ్గులతో, ఆవు పేడతో చేసినగొబ్బెమ్మలతో కళకళలాడుతున్నాయి. ఆడపిల్లలు రోజుకు ఒక రకమైనముగ్గు వేసుకుంటూ గొబ్బెమ్మలు పెట్టుకోవడంతో పురవీధులలో సంక్రాంతి పండుగ శోభ కనబడింది

ముగిసిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణపై మండల స్థాయి శిక్షణ

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు: స్థానిక గుడ్లవల్లేరు మండల పరిషత్ కార్యాలయంలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణ అంశంపై 2 వ రోజు మండలంలోని వివిధ మండల స్థాయి అధికారులకు, గ్రామ సర్పంచ్ లకు, పంచాయతీ కార్యదర్శులు (గ్రేడ్ 1-5), సచివాలయ సిబ్బందికి మండల స్థాయిలో రెండు రోజుల శిక్షణా తరగతులను నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం, రాష్ట్రీయ గ్రామ్ స్వరాజ్ అభియాన్ నిధులతో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి మరియు పంచాయతీ రాజ్ శిక్షణా సంస్థ అధ్వర్యంలో నిర్వహించిన ఈ శిక్షణ కార్యక్రమంలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణ ఆవశ్యకత, పంచాయతీ అభివృద్ధి సూచిక, లోకల్ ఇండికేటర్ ఫ్రేమ్ వర్క్, జి. పి. డి .పి ఆక్టివిటీస్ గురించి,9 రకాల థీమ్స్ తో పేదరికం లేని మెరుగైన జీవనోపాదులు కల్పన, ఆరోగ్యవంతమైన, బాలహిత, సమృద్ధిగా నీరు కల్పన, పచ్చదనం పరిశుభ్రత, స్వయం సమృద్ధిగా మౌలిక సదుపాయములు, సామాజిక న్యాయము మరియు భద్రత, సుపరిపాలన, మహిళా స్నేహపూర్వక గ్రామము తదితర అంశములపై శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డివిజినల్ లెవెల్ డెవెలప్మెంట్ ఆఫీసర్ గుడివాడ వి సుజాత హాజరైనారు.

కాలిఫోర్నియా బాదంపప్పులతో క్రిస్మస్ వేడుకలను జరుపుకోండి

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): అత్యంత ప్రజాదరణ పొందిన కాలిఫోర్నియా బాదం పప్పులు మాంసకృత్తులు, ఆరోగ్యకరమైన కొవ్వులు, ఫైబర్, మెగ్నీషియం, జింక్, ఫాస్ఫరస్‌తో సహా 15 ముఖ్యమైన పోషకాలతో కూడిన పోషకాహార పవర్‌హౌస్ గా నిలుస్తాయి. బాదం రుచిని పెంచడమే కాకుండా పండుగ సృష్టికి కొంత పోషక విలువలను అందిస్తాయి. ప్రముఖ సైంటిఫిక్ జర్నల్స్‌లో ప్రచురించబడిన 200 కంటే ఎక్కువ అధ్యయనాల్లో, ప్రతిరోజూ కొన్ని కాలిఫోర్నియా బాదంపప్పులను తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెరను నిర్వహించడంలో సహాయపడుతుందని చూపబడింది. అవి పండుగ సీజన్‌లో బరువు నిర్వహణకు తోడ్పడతాయి. భారతీయుల కోసం ఇటీవల ప్రచురించబడిన ఐసీఎంఆర్-ఎన్ఐఎన్ ఆహార మార్గదర్శకాలు మంచి ఆరోగ్యం కోసం ప్రతిరోజూ తినగలిగే పోషకమైన గింజలలో బాదంను ఒకటిగా గుర్తించాయి. కాలిఫోర్నియా బాదంపప్పులను పండుగ వంటకాల్లో చేర్చడం ద్వారా వేడుకలను మరింత ఉల్లాసంగా, ఆరోగ్యవంతంగా చేసుకోండని బాలీవుడ్ నటి సోహా అలీ ఖాన్ పిలుపునిచ్చారు.